

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 258-02-2025 | సంపుటి - 21 | సంచిక - 308 | రూ : 4 | పేజీలు: 8



# మాజీ మంత్రులవి అబద్ధాలు

- ప్రాజెక్టులను సర్వనాశనం చేసిన ఘనత కేసీఆర్, హరీశ్‌లదే
- కార్మికులను రక్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాం: మంత్రి ఉత్తమ్

మహబూబ్‌నగర్: రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన భారాస ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో డీవాటరింగ్‌కూ విద్యుత్తు సదుపాయం కల్పించలేదని, ఈ ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రులు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో ప్రాజెక్టులను సర్వనాశనం చేసిన ఘనత కేసీఆర్, హరీశ్‌రావులదేనన్నారు. గురువారం ఆయన ఇక్కడ ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎంపీ వీహెచ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. "ప్రాజెక్టులో రూ.3వేల కోట్ల విలువైన పనులు ఆగిపోతే భారాస ప్రభుత్వం వదిలేసింది. ప్రస్తుతం తొమ్మిది కిలోమీటర్ల తవ్వకం మాత్రమే మిగిలింది. ఆ పనులను చేస్తుండగానే ప్రమాదం జరిగింది. పనులన్నీ సమర్థంగా, పూర్తి పారదర్శకతతో చేస్తున్నాం. భారాస నేతలకు కూడా ఘటనా స్థలానికి రావడానికి అనుమతిచ్చాం. వారి హయాంలో కాళేశ్వరం కడితే సందర్శన కోసం శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్కలకు అనుమతివ్వలేదు. భారాస ప్రభుత్వంలో నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా నామమాత్రపు ఆయకట్టుకే నీళ్లిచ్చారు. రూ.లక్ష కోట్ల ఖర్చుతో నిర్మించిన కాళేశ్వరం కూలింది. రూ.27 వేల కోట్లతో కట్టిన పాలమూరురంగారెడ్డి ఒక్క ఎకరాకైనా నీళ్లివ్వలేదు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీలను పూర్తి చేయలేదు. ప్రాణహిత చేవెళ్లను వదిలేశారు. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో తొమ్మిది మంది చనిపోతే ఎవరూ పట్టించుకోలేదు. నాడు రేవంత్‌రెడ్డి అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తే దారిలోనే అరెస్టు చేశారు. దేవాదుల టన్నెల్‌లో ఏడుగురు చనిపోతే ఐదేళ్ల తర్వాత అస్థిపంజరాలు దొరికాయి. కాళేశ్వరం టన్నెల్, పాలమూరు రంగారెడ్డి పనుల్లోనూ ప్రమాదాలు జరిగినా వాటి గురించి మాట్లాడలేదు. మాసాయిపేటలో 25 మంది పిల్లలు చనిపోతే నాటి సీఎం, మంత్రులు బాధితులను

తరువాయి 2లో

## తెలంగాణ 'రైజింగ్'ని

# ఎవరూ ఆపలేరు...

- ప్రపంచస్థాయి నగరాలతోనే హైదరాబాద్ పోటీ
- ఏడాదిలోనే అత్యధిక పెట్టుబడులు రాబట్టాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ డెలివరీ సెంటర్‌ని ప్రారంభించిన సీఎం

హైదరాబాద్ : తెలంగాణతో పాటు హైదరాబాద్ మహానగరం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏడాదిలోనే రాష్ట్రానికి దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు రాబట్టామని తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ని ఎవరూ ఆపలేరని ఉద్ఘాటించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి హైదరాబాద్ మాదాపూర్‌లో హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ డెలివరీ సెంటర్‌ని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముంబయి, దిల్లీ, చెన్నై, బెంగళూరులతో కాకుండా ప్రపంచస్థాయి నగరాలతో హైదరాబాద్ పోటీపడుతోంది. ఈ విషయాన్ని నేను మొదట్లో ప్రస్తావించినప్పుడు అదో పెద్ద కలగా కొందరు కొట్టిపారేశారు. డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారిందని ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది.

**సమర్థంగా బయోఏషియా సదస్సు..**

లైఫ్ సైన్సెస్‌లో అగ్రగామిగా ఉన్న ఆమ్‌జెన్‌ను రాష్ట్రానికి ఆహ్వానించాం.

తరువాయి 2లో




# ఓటెత్తిన పట్టభద్రులు



- రికార్డుస్థాయిలో 69.57 శాతం పోలింగ్
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.40% పోలింగ్

అమరావతి: శాసనమండలిలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ స్వల్ప వాదనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఓట్లు వేసేందుకు పట్టభద్రులు ఉత్సాహంగా తరలిరావడంతో 69.57 శాతం పోలింగ్ నమోదయింది. ప్రధాన అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు గుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలో ఓటు వేశారు. గుంటూరులోని చలమయ్య కళాశాల వద్ద పీడీఎఫ్ పోలింగ్ ఏజెంట్లు, జనసేన నేతల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. బాపట్లలోని పురపాలక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సీపీఎం కార్యకర్తపై తెదేపా ఏజెంట్లు

తరువాయి 2లో



## ఉగాదికి పీ4 అమలు

* నాలుగు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు
* ఆగస్టు నాటికి 5 లక్షల కుటుంబాల ధ్రువీకరణ లక్ష్యం
* 40 లక్షల కుటుంబాల వారు అర్హులని అంచనా
* కార్యక్రమం అమలుపై సీఎం చంద్రబాబు సమీక్ష
* అట్టడుగున ఉన్న పేదలను ఆదుకోవడమే పథకం లక్ష్యమని వెల్లడి

2లో

## ఇక రైల్వేస్టేషన్లలో..

# 'తెలంగాణ ఉత్పత్తులు'!

- పిండివంటలు, పచ్చళ్లు, చేనేత వస్త్రాల స్టాళ్లు
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణకు ప్రభుత్వ నిర్ణయం
- రాష్ట్రంలో 50 చోట్ల ఏర్పాటుకు రైల్వే శాఖ అనుమతి

2లో



## నేటి నుంచి హంపీ ఉత్సవాలు

- ప్రారంభించనున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

హొసపేటె : విజయనగర గత వైభవాన్ని చాటే హంపీ ఉత్సవాలు ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరగనున్నాయి. ఏటా నిర్వహించే ఈ వేడుకల్లో అలనాటి కళల

తరువాయి 2లో



## బార్ అసోసియేషన్‌ల ఎన్నికలపై యథాతథస్థితి : హైకోర్టు



హైదరాబాద్: రాష్ట్రంలోని బార్ అసోసియేషన్‌ల ఎన్నికల నిర్వహణపై యథాతథస్థితిని కొనసాగించాలంటూ హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అసోసియేషన్ పాలకవర్గం పదవీ కాలాన్ని రెండేళ్లపాటు పొడిగించాలన్న అభ్యర్థనను రాష్ట్ర బార్ కౌన్సిల్ తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లాతోపాటు మరో 24 బార్ అసోసియేషన్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఎ.రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బార్ అసోసియేషన్‌ల ఎన్నికల్లో జోక్యం చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కౌన్సిళ్ల కార్యదర్శులకు 2015లోనే లేఖ రాసినా పట్టించుకోవడంలేదన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో వాదనలు వినడానికి న్యాయమూర్తి విచారణను మార్చి 4కు వాయిదా వేశారు.

## పోసాని కృష్ణమురళికి

# 14 రోజుల రిమాండ్



రైల్వే కోడూరు: కులాలు, సినీ అభిమానులు, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారంటూ నమోదైన కేసులో వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ఇరుపక్షాల మధ్య సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. పోసాని తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ చట్టం ప్రకారం పోసానికి 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇవ్వాలని పొన్నవోలు కోర్టును కోరారు. అందుకు నిరాకరించిన మెజిస్ట్రేట్ 14 రోజుల వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మార్చి 12 వరకు పోసాని రిమాండ్‌లో ఉండనున్నారు. పోసాని కృష్ణమురళిని కడప కేంద్రకారాగానికి తరలించే అవకాశం ఉంది.

తరువాయి 2లో

# తెలంగాణ 'రైజింగ్'ని ఎవరూ ఆపలేరు

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయి 'బయో ఏషియా' సదస్సును సమర్థంగా నిర్వహించాం. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థ డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో సుమారు 60 దేశాల్లో విస్తరించి.. 2.2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. హైదరాబాద్‌లో 2007లో ప్రారంభమైనప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదిగింది. ఇప్పుడు అంతర్జాతీయస్థాయి మౌలిక సదుపాయాలతో 3.2 లక్షల చదరపు అడుగుల స్థలంలో సుమారు 5 వేల మందికి ఉపాధి కల్పించే కొత్త క్యాంపస్‌ను ప్రారంభించడం సంతోషకరం'' అని అన్నారు. టెక్నాలజీ అంటేనే హైదరాబాద్ వైపు చూసేలా చేస్తాం: శ్రీధర్‌బాబు

''కాంగ్రెస్ హయాంలోనే ఐటీ రంగం అభివృద్ధి చెందింది. ఇందుకు 1992లోనే పునాది పడింది. అప్పట్లో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కు ఐటీ రంగం అభివృద్ధికి మార్గనిర్దేశం చేసింది. ఆ స్ఫూర్తితోనే హైదరాబాద్‌ను ఐటీ రంగంలో మరింత ముందుకు తీసుకెళ్తాం. టెక్నాలజీ అంటేనే హైదరాబాద్ వైపు చూసేలా చేస్తాం. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోంది. స్కిల్లింగ్, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కోసం స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కూడా భాగస్వామ్యం కావాలి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీలకు రాష్ట్రాన్ని కేంద్రంగా మారుస్తాం. త్వరలోనే క్వాంటమ్ కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించనున్నాం. ఇందుకు స్విట్జర్లాండ్‌కు చెందిన ఓ దిగ్గజ సంస్థతో ఒప్పందం చేసుకున్నాం'' అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సీఈవో, ఎండీ విజయ్‌కుమార్, డిజిటల్ బిజినెస్ గ్లోబల్ హెడ్ పవన్ వాడపల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఇక రైల్వేస్టేషన్లలో.. 'తెలంగాణ ఉత్పత్తులు'!

హైదరాబాద్: తెలంగాణలోని రైల్వేస్టేషన్లలో మహిళా స్వయం సహాయ సంఘాల ఉత్పత్తుల స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. మొదటి విడతలో 14 మహిళా స్టాళ్లను, రెండో విడత 36 స్టాళ్లను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే రాష్ట్రంలోని సచివాలయం, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాల్లో మహిళా ఉత్పత్తుల స్టాళ్లు కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా రైల్వేస్టేషన్లలోనూ వీటిని ఏర్పాటు చేసి రైలు ప్రయాణికులకు తెలంగాణ ఇంటి వంటల రుచులు చూపించాలని, ఇక్కడి చేనేత ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలంటూ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో దివ్యాదేవరాజన్ రైల్వే శాఖ అధికారులతో సంప్రదింపులు జరపగా వారు అనుమతి ఇచ్చారు.

* **ప్రాథమికంగా కొన్ని స్టేషన్లలో ఇలా..**

సికింద్రాబాద్: పిండివంటల ఉత్పత్తులు; ఖమ్మం: సకినాలు, లడ్డూలు, కారప్పూస; సిర్పూర్: సకినాలు, మురుకులు, ఇతర ఉత్పత్తులు; భద్రాచలం: పచ్చళ్లు; వరంగల్: చిరుధాన్యాలు; కరీంనగర్: చిరుధాన్యాల ఉత్పత్తులు; ఘనాపూర్: చేతి ఉత్పత్తులు; శంకర్‌పల్లి: జూట్, క్లాత్ బ్యాగులు; వికారాబాద్: గాజులు, పూసలు, హారాలు: చర్లపల్లి: మట్టి కప్పులు, నీళ్లసీసాలు, కడాయిలు; జనగామ: టవళ్లు, చేతిరుమాళ్లు; పోచంపల్లి చేనేత ఉత్పత్తులు.

# ఓటెత్తిన పట్టభద్రులు

(మొదటిపేజీ తరువాయి)

చేయిచేసుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. కొన్నిచోట్ల దొంగ ఓట్లు వేస్తున్నారని పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు ఆరోపించారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తప్పక గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గంలో 2019లో 59.95% శాతం పోలింగ్ నమోదుకాగా.. ఈసారి రికార్డుస్థాయిలో 69.57% ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, మార్చి 3న గుంటూరు ఏసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపడతామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి చెప్పారు.

**గోదావరి జిల్లాల్లో 69.49% పోలింగ్**

ఏలూరు, రాజమహేంద్రవరం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 77.90% నమోదైంది. కాకినాడ జిల్లాలో అత్యల్పంగా 66.84% నమోదైంది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 73.09, పశ్చిమగోదావరిలో 69.80, ఏలూరు జిల్లాలో 70.13, తూర్పుగోదావరిలో 67.41% పోలింగ్ నమోదైంది. ప్రజాప్రతినిధులు, నాయకులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరంలో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు రామచంద్రపురంలో ఓటేశారు.

**పిఠాపురంలో డబ్బుల పంపిణీ వీడియో**

పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రానికి సమీపంలోని ఓ కల్యాణమండపంలో.. ఓ నాయకుడు ఓటర్ల జాబితా పరిశీలిస్తూ డబ్బులు పంచుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఫిర్యాదు అందగానే తహసీల్దారు పీవీవీ గోపాలకృష్ణ, సీఐ శ్రీనివాస్ వెళ్లి తనిఖీచేయగా అక్కడ ఎవరూ కనిపించలేదు.

* **ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.40% పోలింగ్**

విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ శాతం 92.40గా నమోదైంది. విశాఖ జిల్లాలో 5,529 మంది ఓటర్లకు 4,829 మంది, విజయనగరంలో 5,223 ఓటర్లకు 4,912 మంది, శ్రీకాకుళంలో 5,035 ఓటర్లకు 4,769 మంది, పార్వతీపురం మన్యంలో 2,333 ఓటర్లకు 2,187 మంది, అల్లూరి జిల్లాలో 1,488 ఓటర్లకు 1,310 మంది, అనకాపల్లిలో 2,885 ఓటర్లకు 2,776 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉత్తరాంధ్రలోని 123 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నిక సజావుగా సాగిందని రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. ఎన్నిక పరిశీలకులు ఎం.ఎం.నాయక్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల తీరును పరిశీలించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు.

# ఉగాదికి పీ4 అమలు

అమరావతి: అట్టడుగున ఉన్న పేదల సాధికారతకు ఉద్దేశించిన పీ 4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉగాది నుంచి అమలు చేయనుంది. తొలిగా ఎంపిక చేసిన 4 గ్రామాల్లో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు. ఈ గ్రామాల్లోని 5,869 కుటుంబాలు లబ్ధిపొందుతాయి. సంపదలో పై వరుసలో ఉన్న కుటుంబాలు... సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలబడటమే పీ 4 విధాన ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఉండవల్లిలోని నివాసంలో గురువారం పీ 4, ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీ 4 అమలు తీరును అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆ వివరాలు ఇవి..

* **ఇప్పటికే పథకాలు పొందుతుంటే మార్పులు చేయబోరు..**

పీ 4 విధానం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హత ఉన్న కుటుంబాలను గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఉన్న సమాచారం, హౌస్‌హోల్డ్ సర్వే, గ్రామసభల ధ్రువీకరణ ద్వారా గుర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల కుటుంబాలు పీ 4కు అర్హులుగా ప్రాథమికంగా అధికారులు అంచనావేస్తున్నారు. తొలివిడతగా ఇప్పటికే రాష్ట్రంలోని 10 జిల్లాల్లో ఫిబ్రవరి 20 నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ఇది మార్చి 2వ తేదీ నాటికి పూర్తికానుంది. ఈ జిల్లాల్లో మొత్తం 52 లక్షల కుటుంబాలు ఉంటే ఇప్పటికి 27 లక్షల కుటుంబాల సర్వే పూర్తయింది. రెండో విడతగా మిగిలిన 16 జిల్లాల్లో మార్చి 8వ తేదీ నుంచి సర్వే ప్రారంభించి 18న పూర్తి చేస్తారు. 16 జిల్లాల పరిధిలో 76 లక్షల కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఈ సర్వేలు అట్టడుగున ఉన్న వారిని గుర్తించడానికే తప్ప..ఇప్పటికే ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల్లో ఎలాంటి మార్పులు చేయబోరు.

**అనుసంధానించడమే ప్రభుత్వ పాత్ర**

* లబ్ధిదారుల ధ్రువీకరణ పూర్తయిన తర్వాత సమృద్ధి బంధనమ్ ప్లాట్‌ఫారంలో ఆయా కుటుంబాల వివరాలను పొందుపరుస్తారు.
* లబ్ధిపొందాల్సిన కుటుంబాలతో సాయం చేసే కుటుంబాలను అనుసంధానించడమే ప్రభుత్వ పాత్రగా ఉంటుంది.
* ఎక్కడా ప్రభుత్వం నేరుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదు. మ్యాచింగ్, ఎనర్జింగ్, ట్రాకింగ్ వరకే పరిమితమవుతుంది. ఇందులో ఎలాంటి ఒత్తిడీ ఉండదు.
* స్వచ్ఛందంగా ఆయా కుటుంబాలు, వ్యక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావొచ్చు.
* ఉగాదికి పీ 4ను ప్రారంభించి ఆగస్టు నాటికి 5 లక్షల కుటుంబాలను సమృద్ధి బంధనమ్‌లో నమోదు చేయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# క్రిప్టో కరెన్సీ మోసం కేసు..
# తమన్నా, కాజల్‌లను విచారించనున్న పోలీసులు

**చెన్నై(ఆర్కేనగర్) : పుదుచ్చేరిలో జరిగిన క్రిప్టో కరెన్సీ మోసానికి సంబంధించి సినీతారలు తమన్నా, కాజల్ అగర్వాల్‌లను విచారించాలని పుదుచ్చేరి పోలీసులు నిర్ణయించారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చని ఆశ చూపి పుదుచ్చేరికి చెందిన 10 మంది నుంచి సుమారు రూ.2.40కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు అశోకన్ అనే విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఫిర్యాదు చేశారు. క్రిప్టో కరెన్సీ కంపెనీ 2022లో కోయంబత్తూరు ప్రధాన కార్యాలయంగా**






**ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సినీనటి తమన్నా, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మహాబలిపురంలోని ఓ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ కంపెనీ కార్యక్రమానికి నటి కాజల్ అగర్వాల్ హాజరయ్యారు. ఆ తర్వాత ముంబయిలో పార్టీ నిర్వహించి, వేలాది మంది నుంచి డబ్బు సేకరించారు. ఈ ఘటనకు సంబంధించి నితీష్ జెయిన్(36), అరవింద్‌కుమార్(40)లను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా తమన్నా, కాజల్ అగర్వాల్‌లను విచారించాలని నిర్ణయించారు.**

## మాజీ మంత్రులవి అబద్ధాలు

(మొదటిపేజీ తరువాయి)

పరామర్శించలేదు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 64 మంది దుర్మరణం పాలైతే బాధిత కుటుంబాలను పలకరించలేదు. నాటి ఏపీ సీఎం జగన్... కృష్ణానదిపై అక్రమంగా ప్రాజెక్టులు కట్టినా పట్టించుకోలేదు. హెలికాప్టర్ గురించి అంటున్నారు.. నేను పైలట్‌ను నాకు దాంట్లో తిరగాలనే మోజు లేదు.

**కార్మికుల రక్షణకు ముమ్మర చర్యలు**

సొరంగంలో రెండు, మూడు రోజుల్లోనే సహాయ చర్యలను పూర్తి చేస్తాం. అసంపూర్తి పనులను రెండు, మూడు నెలల్లోనే తిరిగి ప్రారంభిస్తాం. పెండింగ్ పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నాం. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కటింగ్ నిపుణుల బృందాన్ని రెస్క్యూ ఆపరేషన్‌లో భాగం చేశాం. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకు రావడానికి మార్గాన్వేషణను ముమ్మరం చేశాం'' అని మంత్రి ఉత్తమ్ వివరించారు.

## పోసాని కృష్ణమురళికి 14 రోజుల రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

ఓబులవారిపల్లి మండలం కొర్లకుంటకు చెందిన జనసేన నాయకుడు జోగినేని మణి ఈ నెల 24న పోసానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోసానిపై 196, 353(2), 111 రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 26న పోసానిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయనను ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నేటి నుంచి హంపీ ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా విజయనగర సామ్రాజ్య విశిష్టతలను వివరిస్తారు. కళాకారుల ప్రదర్శనలకు 5 వేదికలను సిద్ధం చేశారు. సుమారు 4 వేల మంది ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రస్తుతం హంపీ వీధులు ఉత్సవ శోభ ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం రాత్రి 7 గంటలకు ప్రధాన వేదికపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వేడుకలు ప్రారంభిస్తారు. తొలిరోజు సినీ నటులు రమేశ్ అరవింద్, సంగీత దర్శకుడు అర్జున్ జన్య, నేపథ్య గాయకులు విజయ్‌ప్రకాశ్, రాజేశ్‌కృష్ణన్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

## ట్రంప్‌తో స్టార్మర్ భేటీ



వాషింగ్టన్: ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలంటే సంబంధిత చర్చల్లో ఉక్రెయిన్‌ను, ఐరోపా దేశాల నేతలను భాగస్వాముల్ని చేయాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కోరారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో గురువారం ఆయన శ్వేతసౌధంలో భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో త్వరలో ట్రంప్ సమావేశం కానున్న నేపథ్యంలో ఈ భేటీ చోటుచేసుకుంది. ఉక్రెయిన్ ప్రతినిధులెవ్వరూ లేకుండానే అమెరికారష్యా ప్రతినిధులు ఇటీవల చర్చించుకున్నప్పటి నుంచి ఇతర దేశాలు స్పందిస్తున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఇప్పటికే ట్రంప్‌ను కలిశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం ట్రంప్‌తో భేటీ కానున్నారు. కీలకమైన ఖనిజాలపై దీనిలో ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. అమెరికాకు వెళ్తూ ఐర్లాండ్‌లో ఆ దేశ ప్రధాని మిఖాయిల్ మార్టిన్‌తో జెలెన్‌స్కీ భేటీ అయ్యారు.

## ఆదిదేవుడికి అరుదైన ప్రసాదం!



చెన్నై(ప్యారిస్): కాగుతున్న నెయ్యిలో వేగుతున్న అప్పంను ఒట్టి చేతులతో తీసి శివుడికి ప్రసాదంగా సమర్పించారు.. తమిళనాడులో ఓ వృద్ధురాలు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ ముదలియార్‌పట్టి వీధిలోని భద్రకాళియమ్మన్ ఆలయం ఉంది. శివరాత్రి రోజున అర్ధరాత్రి ఆలయ ప్రాంగణంలో బియ్యం, తాటిబెల్లంతో చేసిన లడ్డూలవంటి అప్పంలను శివుడికి నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీ. అయితే.. అప్పాన్ని వేడి నెయ్యిలోంచి గరిటె వాడకుండా తీయాల్సి ఉంటుంది. శతాబ్ద కాలంగా వస్తున్న ఈ ఆచారాన్ని.. 52 సంవత్సరాలుగా 92 ఏళ్ల ముత్తమ్మాళ్ చేస్తున్నారు. ఇందుకోసం ఆమె 40 రోజులపాటు వ్రతం చేస్తారు. అప్పం చేశాక గుడికి వచ్చిన భక్తులు ఆ నెయ్యిని తలకు రాసుకొని, దాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. ఆలయ ప్రాంగణంలో పొయ్యి ముందు కూర్చున్న ముత్తమ్మాళ్ ఈ సాహసం చేస్తుంటే చుట్టూ చేరిన భక్తులు శివనామస్మరణలో మునిగిపోయారు.

## నేపాల్‌లో భూకంపం.. ఉత్తరాదిన ప్రకంపనలు

కాఠ్‌మాండూ: నేపాల్‌లో భూకంపం సంభవించింది. దేశ రాజధాని కాఠ్‌మాండూ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున భూ ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.1గా నమోదైంది. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు నేపాల్ భూకంపం ప్రభావం మన దేశంలోని పలు ఉత్తరాది రాష్ట్రాల్లో కనిపించింది. బిహార్ రాజధాని పట్నాతో పాటు పశ్చిమబెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొన్నిచోట్ల ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

# అంజయ్య నగర్ శివాలయంలో ఘనంగా మహ శివరాత్రి వేడుకలు



జగద్గిరిగుట్ట , (ప్రజాస్ఫూర్తి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ శివాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యువజన నాయకులు కొలుకుల జైహింద్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాబు గౌడ్, ప్రవీణ్ చారి, సిద్ధారెడ్డి, హనుమంత్ రెడ్డి, ఆంజనేయులు, రవి చారి, రాజు, లక్ష్మణ్, విగ్నేష్, మైలారం రాజు. తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

* **జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో ఎన్టీఆర్ నగర్ లో హనుమాన్ దేవాలయం మొదటి వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వామి వారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజన్ గౌడ్. శ్రీనివాస్ గౌడ్ చందు గౌడ్. లక్ష్మణ్ .పుల్లారెడ్డి. మహేష్. సంతోష్. తదితరులు పాల్గొన్నారు.

# పులి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు ఖాయం

* **బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్**



రాజపేట ,ప్రజా స్ఫూర్తి : టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలగొండ రంగారెడ్డి ఖమ్మం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన పులి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు ఖాయమని యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలోని పాలెం మండలాలలో పోలింగ్ కేంద్రాలను ఆయనే పరిశీలించిన తర్వాత రాజపేటలో విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ సరళిని ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి చంద్ర, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్, దాచేపల్లి శ్రీనివాసులు, నిండు భగవాన్ రెడ్డి, పెట్టు గాండ్ల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో శివపాతాక జెండా ఆవిష్కరణ.



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : భువనగిరి హౌసింగ్ బోర్డ్ లో గల శాఖలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివ పతాక జెండా ఆవిష్కరణ జరిగింది. ఇన్చార్జి బికే చంద్ర అక్కయ్య మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ స్థాపించి నేటికీ 89 సంవత్సరాలు పూర్తయిందని స్వయంగా పరమశివుడు ద్వారా స్థాపించబడినటువంటి ఈ సంస్థ మానవాళికి ఎన్నో ఆధ్యాత్మిక సేవలు ఉచితముగా అందిస్తూ ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా దరిపల్లి ప్రవీణ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొని విశ్వంలో శాంతి స్థాపన కోసం బ్రహ్మకుమారిస్ పనిచేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఎం బాలేశ్వర్, బికె రామేశ్వర్, ఎం శ్రీనివాస్, బ్రహ్మచారి, బికె ముత్తిరెడ్డి, బికె అరుణ, ప్రేమలత, సరస్వతి, లావణ్య, విద్యాసాగర్ మొదలగు వారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మానసిక శారీరక వికలాంగులైన

# బాలల వికాసానికి కృషి చేయడం అభినందనీయం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : మాన్య స్పోర్ట్స్, కల్చరల్ అకాడమీ (ఏ డివిజన్ ఆఫ్ వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదులోని కెబిఆర్ పార్క్ లో గల వినాయకుని వద్ద పూజలు నిర్వహించామని అని వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రామగోపాల్ రెడ్డి, ప్రమోద్ సాన లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బీరంగుల ఉదయ్ కిరణ్ జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు, మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి మాజీ మంత్రి ఎం.వి మైసూరా రెడ్డి, పారిశ్రామికవేత్తలు రాజేంద్ర అగర్వాల్ సురేందర్ అగర్వాల్, స్కేటింగ్ దినేష్ పంచల్ ఫుట్బాల్ కోచ్ మల్లికార్జున్ గౌడ్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రణయ్ కుమార్ విచ్చేశారు. మానసిక శారీరక వికలాంగులైన బాలల వికాసానికి కృషి చేస్తున్నట్టు వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ ముందు ముందు వేసవి శిబిరాల ద్వార హైదరాబాదులోనే కాకుండా ఇతర జిల్లాలో ట్రైనింగ్ ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. స్కేటింగ్ డ్రాయింగ్ పెయింటింగ్ సంగీతం నాట్యం తదితర అంశాల్లో వారున్నచోటికే నిపుణులు వెళ్లి శిక్షణ ఇప్పించేందుకు మాన్య కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ సన్నాహాలు చేస్తుంది. ఈ బాలలకు మరింత సేవలు అందించనుంది. వితరణ శీలి టి. రామచంద్రారెడ్డి అగస్టా యూఎస్ఏ 50 సంవత్సరాల నుండి నివసిస్తున్నప్పటికీ ఉన్న స్థలాన్ని మర్చిపోకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు బూరి సహాయం అందజేస్తున్నారాని వెల్లడించారు. తన సొంత మహబూబ్నగర్ జిల్లాలో స్వామి వివేకనంద విగ్రహాలు, దేవాలయాలు రెడ్ క్రాస్ సొసైటీ కి మరియు శంకర్ నేత్రాలయాలకు ఎన్నో నిధులు సమకూరుస్తున్నారు. వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ వారు చేస్తున్న కార్యక్రమాలకు తన సహాయాన్ని అందిస్తానని చెప్పారు. నిజామాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు గడ్డం ఆత్మ చరణ్ రెడ్డి సైతం వికాస పార్టీ చారిటబుల్ ట్రస్ట్ వారు చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. మాన్య కల్చరల్, స్పోర్ట్స్ అకాడమీ చేపట్టే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు

# భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు

* **3వేల రూపాయల జరిమానా**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అదనపు కట్నం తేవాలని భార్యను వేధింపులకు గురి చేసిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు 3వేల రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చినట్లు ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట మండలం పుల్లూరు గ్రామానికి చెందిన వనమా యాదగిరికి ముస్తాబాద్ గ్రామానికి చెందిన వనమా లక్ష్మితో 1996 సంవత్సరంలో వివాహం జరిగిందని, వీరికి ఇద్దరు అబ్బాయిలున్నారని తెలిపారు. కొన్నేళ్ల తర్వాత నుంచి భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేశాడని, దీంతో వేధింపులు భరించలేక 2015 సంవత్సరంలో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్లో భర్త వనమా యాదగిరిపై భార్య లక్ష్మి ఫిర్యాదు చేసిందని తెలిపారు. పోలీసులు వనమా యాదగిరిపై అప్పటి ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాధించగా, తనతోపాటు సిఎంఎస్ ఎస్ఐ శ్రావణ్, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఐదుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు. నిందుతుడు వనమా యాదగిరిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ నిందితునికి ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు 3వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు వివరించారు.

# నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లో ఘనంగా శివరాత్రి వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోని శివాలయం పార్కు అవరణంలో గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి,ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, వార్డ్ మెంబర్ ఆవల రాము యాదవ్, కమిటీ ప్రెసిడెంట్ రెడ్డిపల్లి సుధాకర్, కమిటీ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మి, కాలప్ప , కె ఏస్ ఆర్ అభిమానులు భారీ సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును సర్వీసెస్ సెక్రటరీ గొల్లపూడి భానుమతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాలలోమహిళా ఉద్యోగులపై తోటి సాహుద్యోగులు లైంగిక వేధింపులకు గురి చేస్తే మహిళా చట్టాలను ఉపయోగించి ఫిర్యాదు చెయ్యాలని సూచించారు.ఎవరైనా మహిళలు వేధింపులకు గురైతే నేరుగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేధింపులకు గురైన మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పైన మహిళలకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా కలెక్టర్ మహిళలకు ఆర్థిక అక్షరాస్యత కష్టపడి సంపా దించిన వాటికి విలువను, గుర్తింపును తీసుకవస్తుందన్నా రు. భవిష్యత్ ప్రణాళికలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందన్నారు.బ్యాంకు పరిధిలోని ప్రజలందరూ జీవనజ్యోతి, ప్రధానమంత్రి యోజన ఇతర పథకాలన్నీ వినియోగించుకోవాలని, వాటి గురించి అవగాహన చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. అనంతరం జిల్లా న్యాయ సేవా అధికారి సమస్త కార్యదర్శి భానుమతి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నేరమని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. సేవాధికార సంస్థ ఈ సందర్భంగ న్యాయమూర్తి మాట్లాడుతూ లైగింక వేధింపుల నివారణకు విశాఖ మార్గదర్శకాలను భారతసుప్రీం కోర్టు జారీచేసిందని ఆమె గుర్తు చేశారు. స్త్రీల రక్షణ కోసం చట్టం అనే బలమైన సాధనం ఉందని, ఎంతటి బలవంతుడైన చట్టం ముందు సమానమే అన్నారు. మహిళా సాధికారతకు వ్యక్తులు, వ్యవస్థలు సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల కలెక్టర్ విద్యా చందన, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ రెడ్డి, మహిళా శిశు , వయోవృద్ధుల శాఖ అధికారి స్వర్ణలత లెనినా, ఎస్బిఐ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాజబాబు, జిల్లా భారత్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ , తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ పనులను వేగవంతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అన్నపురెడ్డి పల్లి మండలం ఎర్రగుంట వద్ద చేపడుతున్న సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కెనాల్ పనుల పురోగతి పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కెనాల్ పనులను వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా నీటిని పంపుల ద్వారా తరలింపు చేపట్టాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఇరిగేషన్ శాఖ ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ అర్జున్ రావు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల పోలింగ్ చేపట్టామని, జిల్లాలో మొత్తం 2022 మంది ఓటర్లకు గాను 1859 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇందులో పురుషులు ఓటర్లు 973 మరియు మహిళా ఓటర్లు 886 ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం పోలింగ్ శాతం 91.94% గా నమోదయిందని ఆయన తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత మద్య బ్యాలెట్ బాక్స్ లను నల్గొండ రిసెప్షన్ సెంటర్ కి తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ విజయవంతనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# దరువు అంజన్న ను పరామర్శించిన టి యు డబ్ల్యూ జె ( ఐ జె యు ) అధ్యక్షుడు విరాహత్ అలి

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజా గాయకుడు,తెలంగాణ ఉద్యమ కారుడు, ఓ యు జె ఏ సీ చైర్మన్ దరువు అంజన్న మాతృ మూర్తి కమ్మరి లలితమ్మ పరమ పదించారు. విషయం తెలిసిన టి యు డబ్లూ జె (ఐ జె యు) అధ్యక్షుడు విరాహత్ అలి గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం లోని ఆయన నివాసానికి వెళ్లి దరువు అంజన్నను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజన్న తో ఆయన కుటుంబంతో తనకున్న సాన్నిహిత్యాన్ని ,1990 దశకంలో సమాజం కోసం,తెలంగాణ ఉద్యమం కోసం తాము కలిసి చేసిన కార్యక్రమాల గురించి గుర్తు చేసుకున్నారు. లలితమ్మ మృతి పట్ల అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో



టి యు డబ్ల్యూ జె (ఐ జె యు ) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు,దయాకర్ రెడ్డి,మహేందర్,శ్రీనివాస్,అంజన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లికార్జున భ్రమరాంబ కేతమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమం



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కొండపై వెలసిన మల్లికార్జున భ్రమరాంబ కేతమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లికార్జున భ్రమరాంబ కేతమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బిజెపి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సమ్మయ్య యాదవ్, బిజెపి డివిజన్ అధ్యక్షులు పున్నా రెడ్డి , జిల్లా స్పోకు పర్సన్ సురేష్ రెడ్డి, సత్యనారాయణ యాదవ్ , కుమార్ యాదవ్, సింహ యాదవ్ , ఆంజనేయులు , పండరి, బీరప్ప , యాదయ్య , రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుత్తి కోయ గ్రామాలకు ద్విచక్ర వాహనం పై కలెక్టర్ జితేష్ వి. పాటిల్

* **గుత్తి కోయ ఆవాసాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవి పల్లి మండలం పునుకోడు చెలక గ్రామపంచాయతీ పరిధిలోని చింతల మేది, మద్ది గుంపు గుత్తి కోయ ఆవాసాలలో గుత్తి కోయిల జీవనస్థితిగతులను , వారికి అందుతున్న మౌలిక వసతుల గురించి తెలుసుకునుటకు గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్ తో కలసి గుత్తి కోయ ఆవాసాలకు ద్విచక్ర వాహనం మీద చేరుకున్నారు. అనంతరం ఆయన ఆవాసాలలో త్రాగునీరు కొరకు ఏర్పాటు చేసుకున్న చెలమలను పరిశీలించారు. అక్కడ ఉన్న గుత్తి



కోయిల తో ముచ్చటించి వారి యొక్క జీవన విధానం, స్థితిగతులను, ఉపాధి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో అటవీ సంపదను కాపాడాలని, పోడు కొట్టడం చట్ట వ్యతిరేకమని, ఎవరు చెట్లను నరకరాదని సూచించారు. గుత్తి కోయిల అభివృద్ధి కొరకు నిత్యం కృషి చేస్తున్నామని, విద్య, వైద్య , రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. విలువైన జీవితాన్ని అందించడానికి గాను , త్రాగునీరు మరియు మౌలిక వసతులు కల్పించడానికి సరైన రహదారి మార్గం కూడా లేనందున చింతల మెది లో నివసించే 6 కుటుంబాల వారు రోడ్డుకు చేరువుగా రావాలని దాని ద్వారా అన్ని మౌలిక వసతులు , సౌకర్యాలు అందిస్తామని కలెక్టర్ సూచించారు. గ్రామస్తులు త్వరలో తమ నిర్ణయం తెలియజేస్తామని కలెక్టర్ కు తెలిపారు. గ్రామంలో త్రాగునీరు కోసం సంపు నిర్మాణం చేపట్టాలని మిషన్ భగీరథ ఈఈని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో చలపతిరావు, మిషన్ భగీరథ డి ఈ శివయ్య, ఏఈ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు , స్థానికులు పాల్గొన్నారు

# ప్రజాస్ఫూర్తి కథనానికి స్పందన

* **నాడు అంధకారం..నేడు వెలుగుమయం**
* **ఇల్లందు క్రాస్ రోడ్డు లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు**
* **ఇల్లందు క్రాస్ రోడ్డులో వెలుగుమయం.**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఫిబ్రవరి 16వ తేదీన ప్రజాస్ఫూర్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారుల స్పందించారు. ఇల్లందు క్రాస్ రోడ్డులో అంధకారంలో నెలకొని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రజాస్ఫూర్తి దినపత్రికలో ఇల్లందు క్రాస్ రోడ్ లోఅంధకారం.. ప్రమాదాలకు నిలయం.. చౌరస్తా కాస్త.. చావురస్తాగా మారింది.. అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి క్రాస్ రోడ్ లో లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతమంతా వెలుగునీయంగా మారింది..

# కాటమయ్య ఆలయం

## పంచలోహ విగ్రహాలను బహుకరించిన శివకుమార్ గౌడ్

ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ శుభోదయ నగర్ కాలనీ లోని కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పండుగ సందర్భంగా కాటమయ్య స్వామి , సూరమాంబ దేవీ ల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పండాల శివకుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండాల అపర్ణ శివకుమార్ గౌడ్ దంపతులు ఆలయం కు కళ్యాణ ఉత్సవం కోసం శివపార్వతుల పంచలోహ విగ్రహాలను బహుకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళ్యాణోత్సవంలో శివకుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.




ఆలయం కు పంచలోహ విగ్రహాలను బహుకరించిన శివకుమార్ గౌడ్ దంపతులను ఆలయ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ల అజయ్ కుమార్ గౌడ్, వెంకటేష్ గౌడ్, ఆనంద్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, చక్రపాణి గౌడ్,రఘు గౌడ్, బాబు గౌడ్, కిషోర్ గౌడ్, గణేష్ గౌడ్, అవినాష్ గౌడ్, కుషాయిగూడ గౌడ సోదరులు. తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా చేసేందుకు స్థలం పరిశీలన



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : నిరుపేదల కు సొంత ఇంటి కల నిజం చేసే దిశగా ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా చేసేందుకు గురువారం బౌరంపేట లోని సర్వేనెంబర్ 166 లో గల సుమారు 13 ఎకరాల స్థలాన్ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తో కలిసి స్టేట్ ఫ్లాగ్ షిప్ స్కీమ్స్ కమిషనర్ శశాంక గుర్తించారు. టీజీఎండిసి సబ్ స్టాప్ యాడ్ ద్వారా జరపడానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ డైరెక్టర్ టి జి ఎం డి సి సుశీల్ కుమార్, స్థానిక రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- **వ్యవసాయ బావిలో పూడిక పనులు చేస్తుండగా ఘటన**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: విద్యుదాఘాతంతో ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓల్లెపు దేవరాజు అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఓ వ్యక్తికి సంబంధించి వ్యవసాయ బావిలో పూడికతీత పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు ఓల్లెపు దేవరాజు విద్యుదాఘాతానికి గురయ్యాడని తెలిపారు. గమనించిన స్థానికులు వెంటనే హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# ప్రజాకవి

## డాక్టర్.జి. జయరాజు కు ఘన సన్మానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సింగరేణి భవన్ లో ఉద్యోగం చేస్తున్న ప్రకృతి ప్రేమికుడు, ప్రజాకవి, ప్రకృతికవి, సినీగేయ రచయిత, కాళోజి అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమకారుడు, కొత్తగూడెం కార్మిక ఉద్యమనేత, డా. జి. జయరాజు పదవీ విరమణ ఆత్మీయ సభ హైదరాబాదులోనే సింగరేణి భవన్ లో గురువారం జరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కొనంనేని సాంబశివరావు, భద్రాద్రి జిల్లా సి. పి. ఐ ప్రధాన కార్యదర్శి సాబీర్ పాషా, కొత్తగూడెం లోని జయరాజు ప్రకృతి ఆశ్రమం కో ఆర్డినేటర్ జి. సుగుణా రావు, టి. వెంకన్న, అర్జునరావు, భాస్కర్లు జయరాజు దంపతులకు మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు.సింగరేణి కాలరీస్ బాలికల ఉన్నత పాఠశాల , పాల్వంచ బొల్లోరుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ విధులలో ఉన్న అధికారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేయడం జరిగింది.జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 పోలింగ్ కేంద్రాలలో 2022 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

# సికింద్రాబాద్ లోని అశోకా హోటల్ కు బాంబు బెదిరింపు కాల్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని అశోకా హోటల్ లో బుధవారం రాత్రి కలకలం రేగింది. హోటల్ లో బాంబు పెట్టామంటూ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి చెప్పడంతో టెన్షన్ నెలకొంది. దీంతో స్టేషన్ కు వచ్చిన ప్రయాణికులు, స్టేషన్ చుట్టుపక్కల ఉన్న చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. హోటల్ లో ఉన్న వారందరినీ బయటకు పంపించారు. చుట్టుపక్కల బందోబస్తు ఏర్పాటు చేసి అటువైపు ఎవరినీ అనుమతించలేదు. డాగ్ స్క్వాడ్ ను రప్పించి హోటల్ మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, బాంబు కానీ మరే ఇతర అనుమానాస్పద వస్తువులు కానీ దొరకలేదని చెప్పడంతో హోటల్ యాజ మాన్యం ఊపిరి పీల్చుకుంది. బాంబు బెదిరింపు ఆకతాయి పనేనని తేలడంతో స్టేషన్ చుట్టుపక్కల ఉన్న చిరు వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను తరలించుకుపోతుంటే

## కాంగ్రెస్ ప్రభుత్వం ఆపడం లేదు: హరీశ్ రావు

* **బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తుంటే రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని విమర్శ**
* **కృష్ణా జలాలపై బీఆర్ఎస్ ఫిర్యాదు తర్వాతే కేఆర్ఎంబీ వద్ద ఫిర్యాదు చేశారన్న హరీశ్ రావు**
* **ఎస్ఎల్బీసీ సొరంగంలోకి తమను అనుమతించలేదన్న హరీశ్ రావు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. మన నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతుంటే అధికార కాంగ్రెస్ పార్టీ ఈ అన్యాయాన్ని అడ్డుకోవడం లేదని ఆయన విమర్శించారు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించడం లేదని అన్నారు. కృష్ణా జలాలపై తాము నిలదీసిన తర్వాతే కేఆర్ఎంబీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఎస్ఎల్బీసీ



సొరంగంలోకి హరీశ్ రావు, ఇతర బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో వారు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. ఎస్ఎల్బీసీ అంశంపై హరీశ్ రావు మాట్లాడుతూ, సొరంగంలోకి వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో తాము ఇన్ని రోజులు ప్రమాదస్థలికి రాలేదని, కానీ ఆరు రోజులు గడిచినా సొరంగంలో చిక్కుకున్న బాధితులపై ఇప్పటికీ స్పష్టత రాలేదని ఆయన అన్నారు. సహాయక బృందాలను సమన్వయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

# పునర్విభజన అంశం.. ఆ మాటలు నమ్మేలా లేవు : సిద్ధరామయ్య

బెంగళూరు: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. ఆయన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "పునర్విభజన అంశంలో కేంద్రమంత్రి వద్ద సరైన సమాచారం లేనట్లు తెలుస్తోంది. లేదంటే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటకకు నష్టం కలిగించాలి అనే ఉద్దేశమైనా ఉండొచ్చు. లోక్‌సభ స్థానాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ఆయన అన్నారు. కానీ, దీనిపై ఎలాంటి కచ్చితమైన సమాచారం ఇవ్వలేదు. ఆయన మాటలు నమ్మేలా లేవు. ప్రజల్లో మరింత గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోంది" అని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలు



తగ్గుతాయంటూ తమిళనాడు కొంతకాలంగా చెబుతోంది. ఇటీవల ఈ అంశంపై అమిత్ షా మాట్లాడారు. పునర్విభజన ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాలు తగ్గవని స్పష్టం చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఈ అంశంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రధాని మోదీ ఇచ్చిన వాగ్దానం మేరకు దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రోరేటా విధానంలో ఒక్క పార్లమెంటు సీటు కూడా తగ్గదని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు తాము అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. దీనిపై తాజాగా స్పందించిన సిద్ధరామయ్య పైవిధంగా వ్యాఖ్యానించారు.

## ఇందిరా గాంధీపై వ్యాఖ్యలు..
# ఎట్టకేలకు రాజస్థాన్ అసెంబ్లీలో వీడిన ప్రతిష్టంభన!

జైపూర్: దివంగత ప్రధాని ఇందిరా గాంధీపై భాజపా మంత్రి చేసిన వ్యాఖ్యల కారణంగా రాజస్థాన్ అసెంబ్లీలో నెలకొన్న ప్రతిష్టంభన వీడింది. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ చొరవతో చర్చలు నిర్వహించి పరిష్కరించారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మళ్లీ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఇందిరా గాంధీని ఉద్దేశిస్తూ.. మంత్రి అవినాశ్ గహ్లోత్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఖండించారు. తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మంత్రిని సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ అంశంపై వారం రోజులుగా నిరసనలు కొనసాగాయి. సభలో పలువురు హస్తం పార్టీ ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్ చేయడంతో వివాదం మరింత ముదిరింది. ఈ అంశంపై చర్చలు జరపాల్సిందేనని పట్టుబట్టారు.



అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధమే నడిచింది. సీఎం భజన్‌లాల్ శర్మ చొరవతో స్పీకర్ వాసుదేవ్ దేవ్‌నానీ, ప్రతిపక్ష నేత మధ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారించేలా చర్చలు జరిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు స్పీకర్ పట్ల వ్యవహరించిన తీరుకు ఆయన క్షమాపణలు చెప్పారు. దీంతో ఇన్ని రోజులుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ముగింపు పలికారు. కాంగ్రెస్ నేతలు నిరసనను విరమించి అసెంబ్లీ సమావేశాలకు



# వికసిత్ భారత్..
## ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయి

**: ఖర్గే**

ఢిల్లీ: కేంద్రంలోని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని మోదీ చెబుతున్న వికసిత్ భారత్ ద్వారా దేశ ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయని అన్నారు. కొందరు సంపన్నుల ఖజానాను నింపుతోందని ఆరోపించారు. ఖర్చు చేసేందుకు కోట్లాది మంది ప్రజల వద్ద అదనపు ఆదాయం లేదన్నారు. భారత్ సుంకాలు, వాణిజ్య అడ్డంకులను ఎదుర్కొంటోందని ఖర్గే వ్యాఖ్యానించారు. "మోదీజీ..ఖర్చు చేయడానికి కోట్లాది భారతీయులకు అదనపు ఆదాయం లేదు. దేశ జీడీపీలో 60శాతం ప్రజలు ఖర్చు చేయడంపైనే ఆధారపడి ఉంది. కానీ, దేశంలో 10 శాతం మంది మాత్రమే ఆర్థిక వృద్ధి, వినియోగాన్ని పెంచుతున్నారు. మిగిలిన 90 శాతం మంది నిత్యం అవ సరమయ్యే వస్తువులను కొనుగోలు చేయ లేకపోతున్నారు" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొన్నారు. "పన్ను చెల్లిస్తున్న ప్రజల్లో 50 శాతం మందికి దశాబ్ద కాలంలో వేతన పెరుగుదల ఆగిపోయింది. గ్రామీణ వేతనాల పెరు గుదలలోనూ



అంతే. కేంద్రంలోని ఎన్డీయే విధానాలు అందరి ఆదాయాలను పెంచడంలో విఫలమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా భారత్ సుంకాలతో పోరాడుతోంది. వాణిజ్యంలోనూ అడ్డంకులున్నాయి. నిరుద్యోగం ఊబిలో యువత చిక్కుకుపోయింది. ద్రవ్యోల్బణం పీడిస్తోంది. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనాలు దక్కలేదు. మీరు చెబుతున్న వికసిత్ భారత్ సాధారణ ప్రజల జేబులను ఖాళీ చేస్తోంది. కొందమంది సంపన్నుల ఖజానా నింపుతోంది" అని మల్లికార్జున ఖర్గే విమర్శలు చేశారు.

# ఇడ్లీ-సాంబార్ వల్లే టూరిస్టులు రావట్లేదు

**- గోవా ఎమ్మెల్యే**

పణజీ: గోవాలో కొంతకాలంగా పర్యాటకుల సంఖ్య తగ్గడంపై స్థానిక ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇక్కడి బీచ్‌లో ఇడ్లీసాంబార్, వడా పావ్‌లు విక్రయించడం వల్లే విదేశీ పర్యటకుల సంఖ్య తగ్గిందన్నారు. నార్త్ గోవాలోని కలంగూట్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో భాజపా ఎమ్మెల్యే మైఖేల్ లోబో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. "బెంగళూరు నుంచి వచ్చిన వారు బీచ్ దుకాణాల్లో వడా పావ్‌లు అమ్ముతున్నారు. మరికొందరు ఇడ్లీసాంబార్ విక్రయిస్తున్నారు. అందుకే గత రెండేళ్లుగా గోవాకు విదేశీ పర్యటకుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది" అని మైఖేల్ లోబో పేర్కొన్నారు. అయితే, పర్యాటకంపై ఇడ్లీసాంబార్ విక్రయాలు ఏవిధంగా ప్రభావం చూపుతున్నాయన్న



విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించనప్పటికీ.. అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. యుద్ధం కారణంగా ఉక్రెయిన్, రష్యా పర్యాటకులు కూడా గోవాకు రావడం మానేశారని అన్నారు. గోవాలో విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పట్టడానికి ప్రభుత్వం ఒక్కటే కారణం కాదని, అందరూ దీనికి బాధ్యులేనని ఎమ్మెల్యే లోబో పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి గోవా వాసులు తమ దుకాణాలను అద్దెకు ఇవ్వడంపై ఆయన మండిపడ్డారు. గోవాకు విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గడంపై కారణాలు అన్వేషించేందుకు టూరిజం శాఖతో సహా భాగస్వామ్య పక్షాలు సంయుక్తంగా భేటీ అయి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ట్యాక్సీలు, క్యాబ్‌ల మధ్య అనేక సమస్యలు ఉన్నాయని, ఈ పరిస్థితులను సరిదిద్దకుంటే పర్యాటకానికి చీకటి రోజులేనని హెచ్చరించారు.

# కోమాలో భారతీయ విద్యార్థిని..
## కేంద్రం చొరవతో వీసా ఇంటర్వ్యూకు అమెరికా ఓకే



దిల్లీ: కోమాలో ఉన్న భారతీయ విద్యార్థిని కుటుంబం అభ్యర్థనపై అమెరికా నుంచి స్పందన వచ్చింది. భారత ప్రభు త్వం సంప్రదింపుల నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూకు యూఎస్ అవకాశం కల్పించింది. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్లాట్ కేటాయించింది. వీసా కోసం బాధితురాలి తండ్రి చేస్తోన్న ప్రయత్నాలు తమ దృష్టికి రావడంతో భారత విదేశాంగ శాఖ అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్యం నుంచి సానుకూలంగా స్పందించింది. వీసా లేక అత్యవసర ప్రయాణానికి అనుమతి ఇవ్వాలంటూ భారత విదేశాంగశాఖకు చెందిన అమెరికా విభాగం అక్కడి ప్రభుత్వాన్ని సంప్రదించినట్లు సమాచారం. కాలిఫోర్నియా యూనివర్సిటీలో పీజీ చేస్తోన్న నీలమ్ శిందే ఫిబ్రవరి 14న రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. కారు ఢీకొనడంతో శిందే తల, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఉంటున్న ఆమె కుటుంబానికి ఫిబ్రవరి 16న ఈ విషయం తెలిసింది. నీలమ్ తండ్రి వెంటనే వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే చేసిన సోషల్ మీడియా పోస్టు ద్వారా ఆ కుటుంబం ఆవేదన అందరి దృష్టికి చేరింది. "నీలమ్ శిందే అనే విద్యార్థి యూఎస్‌ఏలో ప్రమాదానికి గురై అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆమె తండ్రి ప్రయత్నిస్తున్నారు.

# ఈసీ ముందు నిరవధిక దీక్ష చేస్తా: మమతా బెనర్జీ

దిల్లీ: పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని దుయ్యబట్టారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన దీదీ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా భాజపా ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ



వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హరియాణా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దిల్లీ, మహారాష్ట్రల్లోనూ భాజపా ఈ తరహా వ్యూహాలను అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని భాజపాకు తెలుసునని, అందుకే తప్పుడు జాబితాను రూపొందించే పనిలో పడిందన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (భాజపా) బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

# పుణె అత్యాచార ఘటన.. జస్టిస్ చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు

మహారాష్ట్రలోని పుణెలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు . "నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించలేం. మహిళల కోసం తీసుకొచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలి. ఎక్కడికి వెళ్లినా తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని కలిగించాలి. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం. న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా" అని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. కాగా.. అత్యంత రద్దీగా ఉండే బస్ స్టేషన్‌లలో ఒకటైన స్వర్‌గేట్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతితో నిందితుడు మాటలు కలిపాడు. అక్క అని సంబోధిస్తూ నమ్మించాడు. గ్రామానికి వెళ్లే బస్సు మరో చోట ఉందని చెప్పి బస్ స్టేషన్‌లోనే దూరంగా ఎవరూ లేని చోట ఆగి ఉన్న మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్ దగ్గరకు ఆమెను తీసుకెళ్లాడు. బస్సులోకి వెళ్లేందుకు యువతి తటపటాయించడంతో లోపల ప్రయాణికులు ఉన్నారని.. నిద్రలో ఉండటంతో వాళ్లు లైట్లు వేసుకోలేదని నమ్మించాడు. బస్సులోకి యువతి ప్రవేశించగానే తలుపు వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దత్తాత్రయ రామదాస్ (36)గా పోలీసులు గుర్తించారు. అతడిపై అనేక కేసులు ఉన్నాయని, 2019 నుంచి బెయిల్ మీద ఉన్నాడని తెలిపారు. రామదాస్‌ను పట్టుకొనేందుకు 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం. నిందితుడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ.లక్ష రివార్డు ఇస్తామని పుణె పోలీసులు వెల్లడించారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే స్పందించారు. ఈ కేసుపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించిందని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.



# కండలు పెంచడానికి జిమ్ అక్కర్లేదు.. ఇవి చేయండి చాలు..



ఫిట్‌గా ఉండాలని ప్రత ఒక్కరూ కోరుకుంటారు. కండలు పెంచాలని కలగనేవారి సంఖ్య చాలా ఎక్కువగానే ఉంటారు. కానీ వీరిలో చాలా మంది జిమ్‌కు వెళ్లే సమయం లేకనో, దగ్గర్లో జిమ్ లేదనో ఏదో ఒక కారణంతో జిమ్‌కు వెళ్లరు. జిమ్‌కు వెళ్లకుండా కండలు ఎలా పెరుగుతాయి. ఫిట్‌గా ఎలా ఉంటామని అనే వారు ఉన్నారు. కానీ కండలు పెంచాలన్నా, ఫిట్‌గా ఉండాలన్నా జిమ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. ఇంట్లోనే ఉండి కూడా కండలు పెంచేయొచ్చని, అందుకు కొన్ని కసరత్తులు చాలని చెప్తున్నారు. అంతేకాకుండా జిమ్‌లు, ఎక్విప్‌మెంట్ ఏమీ లేకుండా కండలు పెంచాలని కోరుకునే వారికి కూడా ఇవి అద్భుతంగా పనిచేస్తాయిన చెప్తున్నారు.

**ప్లాంక్**

మోచేతులు భుజాల కింద ఉండేలా.. శరీర భారం మొత్తం ముంజేతులపై (ఫోరార్మ్స్) వేసి బోర్లా కింద పడుకోవాలి. శరీరం మొత్తం స్ట్రైట్‌లైన్‌తో ఉండాలి. ఆ పొజిషన్‌లోనే ఎటూ కలదలకుండా ముంజేతులపై శరీర భారం వేసి 30 నుంచి 60 సెకన్ల పాటు ఉండాలి. భుజాలు, నడుము కండరాలు పెరిగేందుకు ప్లాంక్ ఎక్సర్‌సైజ్ ఉపయోగపడుతుంది.

**పుష్‌అప్స్**

పుష్‌అప్స్ చాలా పాపులర్ ఎక్సర్‌సైజ్. ముందుగా అరచేతులపై భారం వేసి కింద బోర్లా పడుకున్నట్టుగా వాలాలి. ఆ తర్వాత అరచేతులపై భారం వేస్తూ మొత్తం శరీరాన్ని పైకి లేపాలి. ఆ తర్వాత నేలకు తాకేలా శరీరాన్ని కిందికి తీసుకురావాలి.
మళ్లీ చేతులపై భారం వేస్తూ శరీరాన్ని పైకి లేపాలి. ఇలా పుష్‌అప్స్ కొనసాగించాలి. కొత్తగా అయితే రోజుకు 15 పుష్‌అప్స్ చేసి.. ఆ సంఖ్యను క్రమంగా పెంచుకుంటూ పోవాలి. ప్రతీ రోజు పుష్‌అప్స్ చేయడం వల్ల శరీరమంతా కండరాలు పెరిగేందుకు సహకరిస్తుంది.

**స్క్వాట్స్**

ప్రతీ రోజు 15 నుంచి 20 స్క్వాట్స్ చేయాలి. ఇవి కండరాలు బాగా పెరిగేందుకు తోడ్పడతాయి. స్క్వాట్స్ చేసేందుకు, ముందుగా రెండు కాళ్లు చాపి నిలబడాలి. అనంతరం నడుము వంచి కూర్చున్నట్టుగా చేయాలి. కుర్చీ ఉందన్నట్టు అన్నట్టుగా ఊహించుకొని కాళ్లపై భారం వేస్తూ నడుము వంచి గాల్లోనే కూర్చుకున్నట్టుగా చేయాలి. ఆ తర్వాత మళ్లీ లేవాలి. మళ్లీ కూర్చోవాలి. ఇలా రోజుకు 20 వరకు స్క్వాట్స్ చేయాలి.

**బర్పీస్**

బర్పీస్ చేసేందుకు, ముందుగా నిటారుగా నిలబడాలి. ఆ తర్వాత స్క్వాట్ చేసినట్టుగా కూర్చొని అరచేతులను నేలకు ఆనించాలి. వెంటనే కాస్త ఎగిసి కాళ్లను వెనక్కి పంపాలి.
ఆ తర్వాత అదే క్రమంలో ఓ పుషప్ చేసి వెంటనే ఎగిరిపైకి లేవాలి. ఇది వెంటవెంటనే రిపీట్ చేస్తుండాలి. బర్పీస్ చేయడం వల్ల పూర్తి శరీరంలోని కండరాలు పెరిగేందుకు తోడ్పడుతుంది.

**లంజెస్**

ముందుగా రెండు కాళ్లపై నిలబడాలి. ఆ తర్వాత ఏదో ఒక కాలితో ముందుకు అడుగువేయాలి. ఆ తర్వాత నడుమును వంచి.. చాపిన కాలిని కూడా వంచి.. మోకాలు 90 డిగ్రీల కోణంలా నేలకు తాకించాలి. ఆ తర్వాత మళ్లీ లేచి.. ఇంకో కాలితో ఈ పద్ధతిని రిపీట్ చేయాలి. ఒక్కో సెట్‌కు కనీసం 15 వరకు లంజెస్ చేయాలి. ఇది చేసేందుకు సింపుల్‌గానే ఉన్నా.. చాలా అవయవాల్లో కండలు వ్యాకోచించేందుకు తోడ్పడుతుంది.

**వార్మప్ పక్కా**

ఎక్సర్‌సైజ్‌లు కొత్తగా చేస్తున్న వారు ముందుగా కాస్త వార్మప్ చేయాలి. క్రమంగా ఆ తర్వాత క్రమంగా పెంచుకుంటూ వెళ్లాలి. ప్రతీ రోజు వ్యాయమం చేయడం వల్ల శరీరం దృఢంగా, ఫిట్‌గా మారడంతో పాటు బరువు కూడా తగ్గొచ్చు. ఆరోగ్యానికి కూడా మంచిది.

# తల్లిపాలతో శిశువుకు ఇన్ని ప్రయోజనాలా!

ప్రతి శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే. ప్రతి శిశువు తప్పకుండా తల్లిపాలు తాగాలని వైద్యులు కూడా చెప్తారు. తల్లులకు కూడా తల్లిపాల గురించి వివరిస్తారు వైద్యులు. అంతేకాకుండా తల్లిపాల ప్రాధాన్యతను తెలపడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రతి ఏటా వారోత్సవాలు జరుపుతుంది. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వీటిపై అందరికీ అవగామన ఉండాలని డబ్ల్యూహెచ్ఓ ప్రతి సంవత్సరం కొత్త నినాదంతో వారోత్సవాలు జరుపుతుంది. అయితే చాలా మంది తల్లిపాలు.. శిశువు ఆకలి తీర్చడానికి, శిశువుకు కావాల్సిన పోషకాలు అందించడానికి మాత్రమే అనుకుంటారు. అందుకే చాలా మంది డబ్బాలు, మార్కెట్లో లభించే మిల్క్ పౌడర్‌తో పాలు తయారు చేసి పిల్లలకు పట్టించేస్తుంటారు. కానీ తల్లిపాలు కేవలం ఆకలిని మాత్రమే తీర్చవని, శిశువుకు రక్షణ కవచంలా ఉంటాయని నిపుణులు చెప్తున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత తొలిసారి తల్లి నుంచే వచ్చే పాలని ముర్రుపాలు అంటారు. ఇవి తల్లి బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో ఉయోగపడతాయి. బిడ్డ పుట్టిన గంటలోపు శిశువుకు అందే ఈ పాలు జీవితాంతం వారు ఆరోగ్యంగా ఉండటంలో కీలక పాత్ర పోషిస్తాయి. వ్యాధుల్ని సమర్థవంతంగా ఎదుర్కొనే యాంటీ బాడీలు, పోషకాలు తల్లిపాలలో ఉంటాయి. పాలివ్వడం బిడ్డ ఆరోగ్యానికి మాత్రమే కాదు.. తల్లికి కూడా ఎంతో మంచిది అంటున్నారు వైద్యులు.

**జీర్ణ ఆరోగ్యం..**

తల్లి పాలలో ప్రీబయోటిక్స్, ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇవి శిశువు జీర్ణవ్యవస్థలో ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. ఇది జీర్ణశయాంతర సమస్యలను నివారించడానికి, పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది.

**రోగనిరోధక వ్యవస్థకు..**

తల్లి పాలలో యాంటీబాడీస్, ఎంజైమ్‌లు, తెల్ల రక్త కణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శిశువు రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. జీవితంలోని క్లిష్టమైన ప్రారంభ దశల్లో చెవి ఇన్‌ఫెక్షన్‌లు, తామర, అలెర్జీలు, అనారోగ్యాలతో సహా అనేక రకాల ఇన్‌ఫెక్షన్‌లకు వ్యతిరేకంగా ఇది రక్షణ కవచంగా పనిచేస్తుంది.

**సరైన పోషకాహారం..**

నవజాత శిశువులకు తల్లి పాలు ప్రకృతి అందించే పరిపూర్ణ ఆహారం. ఇది శిశువు అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రోటీన్లు, కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, ఖనిజాలతో సహా పోషకాల సమతుల్యతను కలిగి ఉంటుంది. ఇది సులభంగా జీర్ణమవుతుంది. సరైన పెరుగుదల, అభివృద్ధికి అవసరమైన అన్ని పోషకాలను అందిస్తుంది.

**దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా..**

స్థూలకాయం, మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్ వంటివి భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులను ఎదుర్కొనే ప్రమాదాన్ని తల్లిపాలు తగ్గించాయి. తల్లి పాలలో ఉండే బయోయాక్టివ్ భాగాలు శిశువు జీవక్రియ, రోగనిరోధక వ్యవస్థను ప్రోగ్రామింగ్ చేయడానికి దోహదం చేస్తాయి.





# పేరెంట్స్.. పిల్లల మాట కాస్త వినండి!

ప్రస్తుత తరం ముందు ఉంటున్న అతిపెద్ద ఛాలెంజ్ పేరెంటింగ్. గతంలో తరహాలో పిల్లలు ఎలా పెంచాలో నేర్పించడానికి అమ్మమ్మలు, తాతయ్యలు ఈ తరం వారి దగ్గర ఉండటం లేదు. వాళ్లేక్కడో ఊర్లో ఉంటే.. వీళ్లు ఉద్యోగాలతో దూరంగా సిటీలో ఉంటుంటారు. ఈ బిజీ లైఫ్‌లో పెళ్ళి ఆ తర్వాత పిల్లలు పుట్టేస్తారు. కానీ ఆ పిల్లలను ఎలా పెంచాలి? అనేది ప్రతి యంగ్ పేరెంట్స్‌కు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతోంది. కొందరైతే ఏదో అలా పెంచేస్తూ ఉంటారు. దీని వల్ల ప్రస్తుతం పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఉండాల్సిన బాండింగ్ అనేది బలహీనపడుతోందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఇందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ.. ముఖ్యంగా పేరెంటింగ్‌పై పేరెంట్స్‌కు ఉన్న అవగాహన లేమి అతిపెద్ద, మూల కారణంగా చెప్తున్నారు నిపుణులు. పేరంట్స్‌కు పిల్లలకు మధ్య అనేక విషయాల్లో దూరం పెరిగిపోతుంది. ఇక ఉద్యోగస్థులైన తల్లిదండ్రలకు ఈ సమస్య మరీ ఎక్కువ. పిల్లలకు తల్లిదండ్రులకు మధ్య పలు రకాల వైరుధ్యాలు వస్తున్నాయని పిల్లల నిపుణులు చెబుతున్నారు.

**కమ్యూనికేషన్ కావాలి:**

కొన్నిసార్లు పిల్లలు తమ భావాలను తమ తల్లిదండ్రులతో పంచుకోరు. అసలు దానికి కారణమెంటి? కమ్యూనికేషన్ అనేది ప్రతి బంధంలో చాలా కీలకం, ఇతరుల భావాలను అర్థం చేసుకోవడానికి కమ్యూనికేషన్ సహాయపడుతుంది. పేరెంటింగ్ ఎలా చేస్తున్నారనేది ముఖ్యం కాదు, పిల్లల భావాలను, వారు ఏమనుకుంటున్నారో వినడం, అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. పిల్లలు తమ భావాల గురించి మాట్లాడేలా ప్రోత్సహించడం కూడా చాలా ముఖ్యం.

**చిరునవ్వు తప్పనిసరి:**

కొన్నిసార్లు పిల్లలు తల్లిదండ్రులు ముఖాల్లో కనిపించే చికాకు చూసి వారి భావాలను చెప్పడంలో వెనుకాడుతారు. అందుకే వారు తమ స్వంత భావాలను వారితో పంచుకోరు. చికాకు, కోపం తమ వరకే ఉండాలి. పిల్లల వద్దకు వచ్చే వరకు అంతా మరిచిపోవాలి

**పిల్లలకీ టైమ్ ఇవ్వాలి:**

కొంతమంది తల్లిదండ్రులు తమ పనుల్లో ఎప్పుడూ బిజీగా ఉంటారు. అందువల్ల, పిల్లలు తమ తల్లిదండ్రులతో మాట్లాడటానికి ఇదే సరైన సమయమని భావించరు. ఇది వారి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్‌ను సృష్టిస్తుంది. అందుకే ప్రతి పేరెంట్ కూడా తమ పిల్లలకు తప్పకుండా కాస్తంత సమయం కేటాయించాలని చెప్తున్నారు నిపుణులు.
బిజీ లైఫ్, టెన్షన్ అన్నీ ఉంటాయి.. కానీ అవి మన పిల్లలపై ప్రభావం చూపేలా ఉండకూడదని సూచిస్తున్నారు.

**ఆసక్తి మనలోనూ ఉండాలి:**

కొన్నిసార్లు పిల్లలు తమ భావాలను పంచుకోవడానికి ఆశగా ఎదురుచూస్తుంటారు. అలాంటి సమయంలో కసురుకుని, ఇప్పుడు కాదు అంటూ వారిని పక్కన పెట్టేయకండి. అది వారిని మానసికంగా దెబ్బతీస్తుంది. పిల్లలు ఏదైనా చెప్పడానికి ఆసక్తితో వస్తే వారి కోసం ఒక్క ఐదు నిమిషాల సమయం కేటాయించండి. ఆ సమయంలో వారి చిలిని మాటలను వినడానికి ప్రయత్నించండి.

**సమస్యను పెద్దదిచేయొద్దు:**

పిల్లలతో స్నేహ భావం పెంచుకునేలా ప్రవర్తించాలి. చిన్న విషయాన్ని పెద్దదిగా చూడకూడదు. పిల్లలు అన్నాక తప్పులు చేస్తారు. అది వాళ్లు కావలని చేసేవి కావు. తెలిసీ తెలియక జరిగే పొరపాట్లు. పిల్లలు చేసే పొరపాట్లను తప్పులుగా భావించి వారిపై కోప్పడటం చేయకూడదు. వారిని అర్థమయ్యేలా వివరించాలి. ఎంతైనా పిల్లలపై అరిసినంత మాత్రానో, కొట్టడంతోనో జరిగిన తప్పు సరైపోదు కదా. కానీ పిల్లలు చేసింది ఏంటి తప్పు? ఎందుకు తప్పు? అనేది మాత్రం వారికి తప్పకుండా వివరించాలని నిపుణులు చెప్తున్నారు. అలా కాకుండా అతిగారాబం చేయడం కూడా మంచిది కాదని హెచ్చరిస్తున్నారు.

## ఒక్కరోజే రూ.1,150 తగ్గిన బంగారం..

## కిలో వెండిపైనా రూ.1000 క్షీణత..!



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా బలహీన ధోరణులు నెలకొనడంతో దేశీయ బులియన్ మార్కెట్‌లో గురువారం దేశ రాజధాని ఢిల్లీలో 99.9శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1,150 పతనమై రూ.88,200లకు చేరుకుంది. 99.5 శాతం స్వచ్ఛత గల తులం బంగారం ధర రూ.1,150 తగ్గి రూ.87,800 పలికింది. బుధవారం 99.9శాతం స్వచ్ఛత గల బంగారం రూ.89,350, 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.88,950 వద్ద స్థిర పడ్డాయి. గురువారం కిలో వెండి ధర రూ.1,000 క్షీణించి రూ.98,500లకు పతనమైంది. బుధవారం కిలో వెండి ధర రూ.99,500 వద్ద ముగిసింది.

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్ డెలివరీ తులం ధర రూ. 554 పతనమై రూ.85,320లకు చేరుకుంది. "ఎంసీఎక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో బంగారం ధరలు బలహీన పడ్డాయి. ఫలితంగా తులం బంగారం ధర రూ. 85,000లకు పడిపోయింది. మున్ముందు రూ.84,800 స్థాయికి కూడా పతనం కావచ్చు' అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమొడిటీ అండ్ కరెన్సీ, వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది చెప్పారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 23.10 డాలర్లు తగ్గి 2,907.50 డాలర్లకు పడిపోయింది. మరోవైపు స్పాట్ గోల్డ్ ఔన్స్ బంగారం ధర 2,900 డాలర్ల దిగువన 2,892.95 డాలర్లకు చేరుకుంది. ఏప్రిల్ రెండో తేదీ నుంచి మెక్సికో, కెనడాలపై అమెరికా దిగుమతి సుంకాలు 25 శాతం పెరుగనున్న నేపథ్యంలో బంగారం, వెండిలకు ఇన్వెస్టర్ల నుంచి గిరాకీ పెరుగనున్నది. కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ వెండి ధర 32.47 డాలర్లుగా ఉంది.

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. మహాశివరాత్రి పర్వదినం కావడంతో మార్కెట్లు బుధవారం మూతపడిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం మార్కెట్లు సానుకూల పవనాల మధ్య లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరి సెషన్‌లో సెనెక్స్ లాభాల్లో కదలాడినా.. లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. క్రితం సెషన్ (మంగళవారం ముగింపు)తో పోలిస్తే సెన్సెక్స్ 74,706.60 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 74,520.78 కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 74,834.09 పాయింట్లకు పెరిగింది.

చివరకు 10.31 పాయింట్లు పెరిగి.. 74,612.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 2.50 పాయింట్లు తగ్గి.. 22,545.05 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 892 షేర్లు లాభపడ్డాయి. మరో 2,925 షేర్లు పతనమయ్యాయి. శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్ ఫార్మా, హిందాల్కో ఇండస్ట్రీస్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఆటో, టాటా మోటార్స్ నష్టపోయాయి. బ్యాంక్, మెటల్ మినహా అన్ని ఇతర రంగాల సూచీలు నష్టాల్లోనే కొనసాగాయి. ఆటో, మీడియా, ఎనర్జీ, క్యాపిటల్ గూడ్స్, రియాల్టీ, పవర్ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం తగ్గగా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2శాతం పడిపోయింది.

## భారత్ మార్కెట్‌లోకి ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్..




**న్యూఢిల్లీ:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్స్ భారత్ మార్కెట్‌లోకి తన ఎంజీ కామెట్ బ్లాక్‌స్టోర్మ్ ఎడిషన్ కారును ఆవిష్కరించింది. హెక్టర్, గ్లోస్టర్, ఆస్టర్ తర్వాత ఎంజీ మోటార్స్ తీసుకొస్తున్న బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ ఎంజీ కామెంట్ నాలుగోది. టాప్ స్పెక్ ఎక్స్‌క్లూజివ్ ట్రిమ్ ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు ధర రూ.7.80 లక్షలు పలికింది. ఎంజీ కామెట్‌తో పోలిస్తే ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు ధర రూ.30,000 వేలు ఎక్కువ పలుకుతుంది. ఆసక్తిగల కస్టమర్లు రూ.11 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చు.

బ్లాక్ బ్యాడ్జెస్, డార్క్ క్రోమ్‌తోపాటు స్టారీ బ్లాక్ కలర్ స్కీంతో ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు వస్తోంది. ఎల్ఈడీ డీఆర్ఎల్స్, అల్లాయ్ వీల్స్, డోర్లపై సైడ్ క్లాడింగ్ లోయర్ బంపర్ లిప్‌పై రెడ్ అసెంట్స్‌తోపాటు ఆల్ బ్లాక్ ఎక్స్‌టీరియర్ ఫీచర్లు ఉంటాయి. టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, డ్రైవర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోసం డ్యుయల్ 10.25 అంగుళాల డిస్‌ప్లేలు, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే, మాన్యువల్ ఏసీ, కీలెస్ ఎంట్రీ, పవర్డ్ ఓఆర్వీఎంస్ ఉంటాయి. నాలుగు స్పీకర్లతో కూడిన అప్‌గ్రేడెడ్ మ్యూజిక్ సిస్టమ్ ఉంటుంది. ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు ప్రయాణికుల సేఫ్టీకి ప్రాధాన్యం ఇస్తుంది. అందుకోసం రెండు ఎయిర్ బ్యాగ్స్, రివర్స్ పార్కింగ్ కెమెరా, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్ (ఈబీడీ)తోపాటు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్), ఐసో ఫిక్స్ చైల్డ్ సీట్ యాంకర్స్ ఉంటాయి.

ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ కారు రేర్ వీల్ మౌంటెడ్ మోటార్‌తో వస్తున్నది. ఈ విద్యుత్ మోటార్ గరిష్టంగా 41 బీహెచ్‌పీ విద్యుత్, 110 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. ఈ కారులో 17.4 కిలోవాట్ల బ్యాటరీ ఉంటుంది. సింగిల్ చార్జింగ్‌తో ఈ కారు 230 కి.మీ దూరం ప్రయాణిస్తుంది.

## ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్తికరంగా మారిన

# సెమీస్ బెర్తులు..!




### టీమిండియాను ఢీకొట్టే జట్టు ఏదీ..?

**న్యూఢిల్లీ:** చాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్-బీలో పోరు ఆసక్తికరంగా మారింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై ఆఫ్ఘనిస్తాన్ జట్టు విజయం సాధించింది. దాంతో సెమీస్ రేసు ఆసక్తికరంగా మారింది. గ్రూప్-బీ నుంచి ఎలిమినేట్ అయిన తొలి జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. ఆ గ్రూప్‌లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్‌కు ఇంకా సెమీ ఫైనల్ రేసులో ఉన్నాయి. ఇక ఇప్పటికే గ్రూప్-ఏలో సెమీ ఫైనల్స్‌కు రెండు జట్లు చేరుకున్నాయి. భారత్, న్యూజిలాండ్ సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. ఈ రెండు జట్లు గ్రూప్‌లో ఏ స్థానంలో ఉంటాయన్నది క్లారిటీ లేదు. అలాగే, సెమీస్‌లో ఏయే జట్లు పోటీపడుతాయన్నది తేలలేదు. గ్రూప్-ఏ, గ్రూప్-బీలో ఇంకా రెండు మ్యాచులు మిగిలి ఉన్నాయి.

గ్రూప్-ఏలో పాయింట్ల పట్టికలో ఎవరు అగ్రస్థానంలో నిలుస్తారో మార్చి 2న తేలనున్నది. ఆ రోజున భారత్-న్యూజిలాండ్ జట్లు పోటీపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచి.. సెమీఫైనల్స్‌లో గ్రూప్-బీలో రెండోస్థానంలో ఉన్న జట్టుతో తలపడుతుంది. గ్రూప్-ఏలో రెండోస్థానంలో ఉన్న జట్టు.. గ్రూప్-బీలో అగ్రస్థానంలో ఉన్న జట్టుతో పోటీపడుతుంది. గ్రూప్-ఏలో గురువారం పాకిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య మ్యాచ్ జరుగనున్నది. అయితే, మ్యాచ్ కేవలం లాంఛనప్రాయంగా మాత్రమే జరుగనున్నది. ఇప్పటికే రెండుజట్లు చాంపియన్స్ ట్రోఫీ నుంచి ఎలిమినేట్ అయ్యాయి. ఆడిన రెండు మ్యాచుల్లో ఓటమిపాలయ్యాయి.

ఇక గ్రూప్-బీలో సమీకరణాలు ఆసక్తికరంగా ఉన్నాయి. చివరి రెండు మ్యాచుల్లో ఒకటి ఆఫ్ఘనిస్తాన్-ఆస్ట్రేలియా మధ్య దక్షిణాఫ్రికా-ఇంగ్లాండ్ మధ్య మరో మ్యాచ్ జరుగనున్నది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా విజయం సాధిస్తే సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఆఫ్ఘనిస్తాన్‌ను ఆస్ట్రేలియా ఓడిస్తే.. ఇంగ్లాండ్‌తో దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. అయితే, ఆఫ్ఘనిస్తాన్ ఆస్ట్రేలియాను ఓడిస్తే.. ఆ జట్టు సెమీస్‌కు చేరుతుంది. ఆస్ట్రేలియా సెమీస్ చేరాలంటే.. ఇంగ్లాండ్-సౌతాఫ్రికా మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంటుంది. ఇంగ్లాండ్ జట్టు సౌతాఫ్రికాను భారీ తేడాతో ఓడిస్తేనే సాధ్యమవుతుంది. ఆసిస్ రన్‌రేట్ (ం0.475) కంటే.. ప్రొటీస్ జట్టు రన్‌రేట్ (ం2.140) ఎక్కువగా ఉన్నది.

గ్రూప్-బీలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు గెలిస్తే.. న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో భారత్ గెలిస్తే.. రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా.. సెమీస్‌లో ఆస్ట్రేలియాను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. భారత్ పాయింట్ల పట్టికలో రెండు స్థానంలో నిలిస్తే మాత్రం దక్షిణాఫ్రికాతో తలపడాల్సి ఉంటుంది. మరో వైపు ఆస్ట్రేలియాను ఆఫ్ఘనిస్తాన్ ఓడిస్తే.. దక్షిణాఫ్రికాతో తలపడాల్సి రావొచ్చు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు ఓడిపోతే మాత్రం.. భారత్ సెమీస్‌లో ఆఫ్ఘనిస్తాన్‌ను ఎదుర్కొంటుంది.. భారత జట్టు న్యూజిలాండ్‌ను ఓడించి.. గ్రూప్-ఏలో అగ్రస్థానంలో ఉంటే.. దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా ఓడిపోతే.. రెండు జట్లలో ఏ జట్టు రన్ రేట్ మెరుగ్గా ఉంటుందో చూడాల్సి ఉంటుంది. మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్లు మాత్రమే రెండోస్థానంలో నిలిచి సెమీస్‌కు చేరుతాయి.

## మళ్లీ ఐపీఎల్‌లోకి కెవిన్ పీటర్సన్..

### ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్‌కు కీలక బాధ్యతలు అప్పగించిన ఢిల్లీ క్యాపిటల్స్




**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ మరోసారి ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. ఈ మేరకు కేపీతో ఢిల్లీ క్యాపిటల్స్ ఒప్పందం చేసుకుంది. రాబోయే సీజన్‌కు మెంటర్‌గా వ్యవహరిస్తాడని పేర్కొంది. మెంటార్ రోల్‌లో కేపీ ఢిల్లీ జట్టును ముందుండి నడిపించనున్నాడు. ప్రస్తుతం ఢిల్లీ జట్టు హెడ్‌కోచ్‌గా హేమంగ్ బదానీ, అసిస్టెంట్ కోచ్‌గా మాథ్యూ మాట్, బౌలింగ్ కోచ్‌గా మునాఫ్ పటేల్, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా వేణుగోపాలరావు పని చేస్తున్నాడు. వీరందరితో కలిసి ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు కోసం కేపీ వ్యూహాలు రచించనున్నాడు. గతంలో కేపీ తరపున ఆటగాడిగా బరిలోకి దిగి దుమ్మురేపాడు ఈ ఇంగ్లాండ్ మాజీ ప్లేయర్. ఆ తర్వాత కొద్దిరోజులు కామెంటేటర్‌గా అలరించాడు. గతంలో ఎప్పుడూ కోచింగ్ రోల్‌లో మాత్రం కనిపించలేదు. తొలిసారిగా కోచింగ్ టీమ్‌లో చేరనున్నాడు.

కేపీ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్ల తరఫున ఆడాడు. మొదట ఢిల్లీ డేర్ డెవిల్స్ (ప్రస్తుత ఢిల్లీ క్యాపిటల్స్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, డెక్కన్ చార్జెస్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రైజింగ్ పుణే సూపర్‌జెయింట్స్ తరపున ఐపీఎల్ ఆడాడు. ఇదిలా ఉండగా.. ఐపీఎల్ ఈ ఏడాది మార్చి 22న మొదలుకానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఐపీఎల్ 18వ సీజన్ షెడ్యూల్‌ను బీసీసీఐ విడుద లచేసింది. ఢిల్లీ క్యాపిట్స్ జట్టు తొలి మ్యాచ్‌ను మార్చి 24న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనున్నది. ప్రస్తుతం ఢిల్లీ జట్టు యాజమాన్యం కెప్టెన్‌ను నియమించే పనిలో పడింది. గత సీజన్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన రిషబ్ పంత్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పంత్ స్థానంలో బాధ్యతలు ఎవరికి అప్పగించాలని చూస్తున్నది. అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, ఫాఫ్ డు ప్లెసిస్ కెప్టెన్ రేసులో ముందువరుసలో ఉన్నారు.

## పాకిస్థాన్ వర్సెస్ బంగ్లాదేశ్

# మ్యాచ్ రద్దు..



**రావల్పిండి:** పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా రావల్పిండిలో గురువారం జరగాల్సిన గ్రూప్ ఏ మ్యాచ్ వర్షం వల్ల రద్దు అయ్యింది. ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో రెండు జట్లు చెరో పాయింట్ లభించింది. ఆతిథ్యదేశం పాకిస్థాన్ గ్రూపులో ఒక పాయింట్‌తో నాలుగవ స్థానంలో నిలిచింది. ఒక్క మ్యాచ్ కూడా నెగ్గకుండానే టోర్నీ నుంచి పాక్ నిష్క్రమించింది.

న్యూజిలాండ్, ఇండియా చేతిలో ఓడిన పాక్ జట్టు.. తన చివరి మ్యాచ్‌లో సత్తా చాటనుకున్నది. కానీ వర్షం వల్ల ఆ అవకాశం దక్కలేదు. 2017లో చాంపియన్స్ ట్రోఫీ గెలిచి, ఈ సారి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు టోర్నీలో చేదు అనుభవం మిగిలింది. పాకిస్థాన్ కన్నా ఉత్తమ నెట్ రన్‌రేట్ కలిగి ఉన్న బంగ్లాదేశ్ జట్టు గ్రూప్ ఏలో మూడవ స్థానంలో నిలిచింది.

రావల్పిండిలో బుధవారం రాత్రి మొత్తం వర్షం కురిసింది. దీంతో మైదానం చిత్తడిగానే ఉన్నది. పలుమార్లు ఇవాళ అంపైర్లు .. పిచ్‌ను పరిశీలించినా.. ఆటకు అనుకూలంగా లేకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. గ్రూపు ఏ నుంచి న్యూజిలాండ్, ఇండియా జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. ఆటగాళ్లలో అనుభవం లేకపోవడం వల్లే టోర్నీ నుంచి పాకిస్థాన్ త్వరగా నిష్క్రమించినట్లు తాత్కాలిక చీఫ్ సెలెక్టర్ అకీబ్ జావెద్ తెలిపారు.

చాంపియన్స్ ట్రోఫీ గ్రూపు బీ నుంచి ఇంగ్లండ్ జట్టు ఔట్ అయ్యింది. అయితే సెమీస్‌లోకి వెళ్లేందుకు ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, సౌత్ ఆఫ్రికా పోటీపడుతున్నాయి.

# ధోనీకి ఇదే చివరి ఐపీఎల్..?

### క్లారిటీ ఇచ్చిన మాజీ కెప్టెన్..!

### నెట్టింట ఇప్పుడు ఇదే వైరల్..!



**ముంబై:** భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ చెన్నైకి చేరుకున్నాడు. మార్చిలో మొదలవనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 కోసం డెన్‌కు చేరుకున్నాడని ఫ్రాంచైజీ పేర్కొంది. అయితే, ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ అనే చర్చ సాగుతున్నది. ఈ విషయంలో మాజీ కెప్టెన్ సైతం క్లారిటీ ఇచ్చాడని పలువురు అభిమానులు పేర్కొంటున్నారు. ధోనీ తాను వేసుకున్న టీ షర్ట్‌తోనే.. తనకు ఇదే ఆఖరి ఐపీఎల్ అనే సందేశం ఇచ్చినట్లుగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఐపీఎల్ కోసం చెన్నైకి ధోనీ చేరుకున్నాడు. పటిష్ట భద్రత మధ్య విమానాశ్రయంలో నుంచి వస్తుండగా.. అందరి దృష్టి ధోనీ వేసుకున్న టీ షర్ట్‌పై ఉంది. ఆ టీ షర్ట్‌పై ఉన్న డిజైన్‌లో మోర్స్ కోడ్ ఉందని.. దానికి 'చివరిసారి' అని అర్థం చెబుతూ.. ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ అంటూ సోషల్ మీడియాలో హాట్ చర్చ సాగుతున్నది.

ఇదిలా ఉండగా.. ఇటీవల జియో హాట్‌స్టార్‌లో నటుడు సన్నీ డియోల్‌తో కలిసి చాంపియన్స్ ట్రోఫీలో భారత్-పాక్ మ్యాచ్‌ను చూశాడు. అంతకు ముందు సంజు సామ్సన్‌తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఫిట్‌గా ఉండేందుకు.. రెండునెలల ఐపీఎల్‌కు కోసం సిద్ధంగా ఉండేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందని ధోనీ పేర్కొన్నాడు. తాను సంవత్సరానికి కొన్ని నెలలు మాత్రమే ఆడుతానని.. కానీ, తొలిసారి ఎలాగైతో ఆడానో.. అదే తరహాలోనే ఆస్వాదించాలనుకుంటున్నానని చెప్పాడు. గత ఆరు నుంచి ఎనిమిది నెలలు కష్టపడాల్సి ఉంటుందని.. ఎందుకంటే ఐపీఎల్ అత్యంత క్లిష్టమైన టోర్నీల్లో ఒకటని పేర్కొన్నాడు. మీ వయసు ఎంత అని ఎవరూ పట్టించుకోరని.. మీ వయసు ఎంత అయినా.. లీగ్‌లో స్థాయి తగ్గకూడదని.. అందుకే తన శారీరక, మానసిక దృఢత్వాన్ని మెరుగుపరుచుకునేందుకు తాను నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

దేశం తరఫున ఆడడం తన కెరీర్‌లో ప్రేరణ అని పేర్కొన్నాడు. తాను పెద్దగా క్రికెట్‌కు గుర్తింపు లేని రాష్ట్రం నుంచి వచ్చానని.. తనకు ఒకసారి అవకాశం వచ్చినప్పుడు.. దేశానికి ప్రాతినిథ్యం వహించినప్పుడు తనకు గొప్ప గౌరవంగా అనిపించిందని ధోనీ పేర్కొన్నాడు. తనకు అవకాశం వచ్చిన తర్వాత మ్యాచ్‌లో గెలవడానికి ప్రయత్నిస్తున్న గెలిచే జట్టులో భాగం కావాలని కోరుకున్నానని.. అది పెద్ద టోర్నీ అయినా.. ద్వైపాక్షిక సిరీస్ అయినా.. మేము ఓ జట్టుగా గెవడానికి ప్రయత్నించామని చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యానని.. కానీ క్రికెట్‌పై ప్రేమ ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉందని ధోనీ వివరించాడు.



# చీరకట్టులో మెరిసిన మలయాళ ముద్దుగుమ్మ అనుపమపరమేశ్వరన్

**టాకీస్:** మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ముద్దుగుమ్మల్లో అనుపమ పరమేశ్వరన్ క్రేజే వేరు. ఈ చిన్నది తక్కువ సమయంలోనే విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన అఆ సినిమాలో నటించింది. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించి మెప్పించింది అనుపమ. ఆతర్వాత ఈ బ్యూటీ క్రేజ్ పెరిగిపోయింది. సోలో హీరోయిన్ గా నటించిన సినిమాలన్నీ సూపర్ హిట్‌గా నిలిచాయి. యంగ్ హీరోలందరి సరసన నటించిన ఈ వయ్యారి తెలుగులో స్టార్ హీరోయిన్ క్రేజ్ ను సొంతం చేసుకుంది. అయితే అనుపమ పరమేశ్వరన్ ఇప్పటివరకు రొమాంటిక్ సీన్స్ లో నటించలేదు. అలాగే బోల్డ్ గానూ కనిపించలేదు. మొన్నామధ్య మాత్రం రౌడీ బాయ్స్ సినిమాలో లిప్ లాక్ తో షాక్ ఇచ్చింది. దాంతో అభిమానులంతా అవాక్ అయ్యారు. అనుపమ ఇలా లిప్ లాక్ తో రెచ్చిపోయిందేంటి అంటూ ఆశ్చర్యపోయారు. ఇక ఇప్పుడు సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నటించిన టిల్లు స్క్వేర్ సినిమాలో హీరోయిన్ గా చేసింది అనుపమ. అయితే ఈ సినిమాలో అనుపమ మునుపెన్నడూ లేని విధంగా బోల్డ్ గా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం అనుపమ లేడీఓరియేంటేడ్ సినిమాలు చేస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీరకట్టులో కొన్ని ఫోటోలు షేర్ చేసింది . ఈ ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి.



# రజనీకాంత్ సరసన పూజా హెగ్డె ఫిక్స్

## అధికారికంగా తెలిపిన కూలీ మూవీ టీం

**టాకీస్:** రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రధారులు. ఆ సినిమాలో పూజా హెగ్డే నటించనున్నట్లు కొన్ని



రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే! అయితే ఇప్పుడు ఈ చిత్రంలో పూజా ఫిక్స్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా తెలిపింది. దీనికి సంబంధించి ఓ ప్రీ లుక్ పోస్టర్ విడుదల చేసి ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టాలంటూ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ ప్రీ లునిక్ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ఖరారు చేశారు. ఇందులో పూజా ఇందులో కీలక పాత్రలో నటించనున్నారా, ప్రత్యేక గీతంలో కనిపించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనిరుధ్ ఈ సినిమాకు 'జైలర్'లోని 'కావాలయ్యా' పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో.. రజనీ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. ఆమిర్‌ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు ఆగస్టులో రిలీజ్ చేసే అవకాశం ఉంది.

# కాయదు లోహర్ జాతకం మారిపోయింది!

టాకీస్: మూడేళ్ళ క్రితం శ్రీవిష్ణు మూవీ 'అల్లూరి'లో నటించిన కాయదు లోహర్ తాజాగా 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మూవీతో మరోసారి తెలుగువారిని పలకరించింది. ఈ సారి ఈ మూవీని తెలుగువాళ్ళు బాగానే ఆదరించారు. తమిళ డబ్బింగ్ సినిమా అయినా... గత వారం విడుదలైన సినిమాలలో కాస్తంత ఆదరణ దీనికే లభించింది. దాంతో కాయదు లోహర్ పై మన నిర్మాతలు దృష్టి సారించారు. మరీ ముఖ్యంగా కాయదు తెలుగులో ఓ క్రేజీ ప్రాజెక్ట్ కు సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని డైరెక్ట్ గా కాయదు చెప్పలేదు కానీ ఓ తెలుగు సినిమాలో తనకు ఛాన్స్ లభించిందని తెలిపింది. ఈశాన్య భారత్ లో పుట్టిన కాయదు లోహర్ పెరిగింది పూణేలో. అయితే



ఇప్పటికే అమ్మడు దక్షిణాది చిత్రాలను చుట్టేసింది. ఏ భాషా చిత్రంలో నటించానా ఆ భాషను నేర్చుకోవడానికి కాయదు గట్టిగా ప్రయత్నిస్తుంది. అలా ఇప్పటికే చక్కగా తమిళం మాట్లాడేస్తోంది. తెలుగులో 'అల్లూరి'లో నటించే సమయంలో కాస్తంత మన భాషనూ అర్థం చేసుకునే స్థితికి చేరింది. ఇప్పుడిప్పుడే క్యూట్ క్యూట్ గా తెలుగు పదాలను పలుకుతోంది. ఇంతకూ విషయం ఏమంటే... విశ్వక్ సేన్‌హీరోగా కె.వి. అనుదీప్ దర్శకత్వంలో సితార ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న 'ఫంకీ' మూవీలో కాయదు ఛాన్స్ దక్కించుకుంది. ఇవాళ సితార ఎంటర్ టైన్ మెంట్ సంస్థలోకి ఏ హీరోయిన్ అయినా అడుగుపెడితే... వాళ్ళ జాతకం మామూలుగా ఉండటం లేదు. వరుసగా అదే బ్యానర్ లో సినిమా ఛాన్సులు దక్కడమే కాదు... కలిసొస్తే... స్టార్ హీరోల పక్కన కూడా అవకాశం లభిస్తుంటుంది. అంత గొప్ప ఛాన్స్ దక్కడం పట్ల కాయదు ఫుల్ ఖుషీలో ఉంది.



# చీర కట్టులో ఇస్మార్ట్ బ్యూటీ సూపర్

టాకీస్: 'నన్ను దోచుకుందువటే' సినిమాతో 2018లో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ 'నభా నటేష్'. మొదటి సినిమాతోనే అందంతో పాటు నటనతోనూ మెప్పించిన ఈ అమ్మడు టాలీవుడ్‌లో ఆ వెంట వెంటనే సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. టాలీవుడ్‌లో అడుగు పెట్టిన తదుపరి ఏడాదిలోనే డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ దర్శకత్వంలో రామ్ కి జోడీగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాలో నటనతో మరోసారి తన సత్తా చాటింది. ఇస్మార్ట్ శంకర్ సూపర్ హిట్ కావడంతో పాటు నభా నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి, ఆమె డైలాగ్ డెలివరీ అన్నింటికి పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత పలు సినిమాల్లో నటించిన నభా నటేష్ కొన్ని కారణాల వల్ల 2022, 23 లో సినిమాల్లో కనిపించలేదు. గత ఏడాది 'డార్లింగ్' అనే వెబ్ మూవీలో కనిపించింది. మరోసారి తన నటనతో మెప్పించింది. డార్లింగ్‌తో మరోసారి నభా నటేష్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్వయంభూ సినిమాలో నటిస్తున్న నభా నటేష్ మరో రెండు మూడు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. త్వరలో నభా నటేష్ కొత్త సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. సినిమాలతో ఈమధ్య కనిపించకున్నా నభా నటేష్ ఫోటో షూట్స్‌లతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంది. తాజాగా మరోసారి అందమైన ఫోటోలతో కన్నుల విందు చేసింది. నభా నటేష్ ఆకట్టుకునే రూపం కారణంగా చీర కట్టులో ఎప్పుడూ చాలా చక్కగా అందంగా కనిపిస్తూ ఉంటుంది. ఎప్పటిలాగే తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోల్లో ఆకట్టుకుంది. ఈసారి అంతకు మించి అనిపించేలా అందమైన చీర కట్టులో జుట్టులో మల్లెపూలు ధరించి కొంటెగా చూస్తూ కెమెరాకు ఫోజ్ ఇచ్చింది. అందమైన నభా నటేష్ ఈ చీర కట్టులో మరింత అందంగా కనిపిస్తుంది అంటూ నెటిజన్స్, అభిమానులు అభిప్రాయం. నభా నటేష్ అందమైన ఫోటో షూట్ వైరల్ కావడం కొత్తేం కాదు. గతంలో ఎన్నో సార్లు ఆమె స్కిన్ షో చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. అయితే ఇలా నిండైన చీర కట్టులోనూ అందంగా కనిపిస్తుంది అంటూ ఈ ఫోటోలను సైతం నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. చీర కట్టు ఫోటోలకు ఈ స్థాయి రెస్పాన్స్ దక్కడం చాలా అరుదుగా ఉంటుంది. నభా నటేష్ మోడ్రన్ డ్రెస్‌లతో పాటు ఇలా చీర కట్టులోనూ చాలా అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నభా నటేష్ ఇంతటి అందానికి దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదని, ఇండస్ట్రీలో టాప్ స్టార్ హీరోయిన్‌గా ఈ అమ్మడు సినిమాలు చేయాలని ఫ్యాన్స్ అంటున్నారు.

# రాజమౌళిపై సంచలన కామెంట్స్

## ఆయన వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్



టాకీస్: టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి రమా రాజమౌళి వివాదంలో చిక్కుకున్నారు. జక్కన్న స్నేహితుడైన యు.శ్రీనివాస్ రావు రాజమౌళి టార్చర్ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సుసైడ్ నోట్ రాయడంతో పాటు సెల్ఫీ వీడియో తీసి విడుదల చేయడం సంచలనంగా మారింది. రాజమౌళిది నాది 34 ఏళ్ళ స్నేహం. ఈటీవీలో రాజమౌళి శాంతి నివాసం సీరియల్ చెయ్యక ముందు నుంచే మేం ఇద్దరం ఫ్రెండ్స్. ఈ విషయం అందరికి తెలుసు. యమదొంగ సినిమాకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నేను చేశాను. కానీ రాజమౌళి జీవితంలో ఒక మహిళ ప్రవేశించడంతో నన్ను దూరం పెట్టారు. ముందు రాజమౌళి..ఆ తర్వాత నేను ఆ అమ్మాయిని ప్రేమించానని తెలిపాడు అయితే కెరీర్ బిగినింగ్ టైమ్‌లో వివాదం ఉందన్న కారణంతో రాజమౌళి కోరిక మేరకు నేను ఆ అమ్మాయిని త్యాగం చేశాను. రాజమౌళి వల్లే 54 ఏండ్లుగా బ్యాచిలర్‌గా మిగిలిపోయాను. ఆయన నెంబర్ వన్ అవ్వడం కోసం నా జీవితాన్నే త్యాగం చేశాను. రాజమౌళి స్టార్ డైరెక్టర్ అయ్యాక ఈ విషయం ఎవరికైనా చెప్తానని.. నన్ను ఇండస్ట్రీలో లేకుండా చేశాడు.

# మా పుట్టబోయే పిల్లలపై కామెంట్స్ చేస్తున్నారు : ప్రియమణి

**టాకీస్:** ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వరుస అవకాశాలు దక్కించుకుంటోంది అందాల తార ప్రియమణి . దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ ప్రియమణికి మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆమె సినిమాలు, సిరీస్, టీవీ ప్రోగ్రామ్స్‌తో బిజీ బిజీగా మారిపోయింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటి.. వివాహం అనంతరం ఎదురైన అనుభవాలను పంచుకుంది. మతాంతర వివాహం కారణంగా తాను లవ్ జిహాద్ ఆరోపణలను ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చింది. తనకు పుట్టబోయే బిడ్డల గురించి కూడా అనవసరంగా కామెంట్స్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. 2017లో ప్రియమణి ఈవెంట్ ఆర్గనైజర్ అయిన ముస్తఫా రాజ్‌ను ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2016లో వీరి నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన నాటి నుంచి తనపై విమర్శలు ఎక్కువయ్యాయని ప్రియమణి తెలిపింది. 'ఎనిమిదేళ్ల క్రితం మా వివాహం అయ్యింది. ఇప్పటికీ మా పెళ్లి



విషయంలో ట్రోల్స్ చేస్తూనే ఉన్నారు. 2016లో నిశ్చితార్థం జరిగింది. ఈ ఆనందకరమైన విషయాన్ని అందరితో పంచుకోవాలనుకున్నా. ఇది తెలిసి అంతా సంతోషిస్తారని అనుకున్నా. బదులుగా నాపై అనవసరమైన ద్వేషం ప్రారంభమైంది. లవ్ జిహాద్ ఆరోపణలు వచ్చాయి. ఆ ద్వేషం ఎక్కడి వరకూ వెళ్లిందంటే.. మాకు పిల్లలు పుట్టాక వారు ఐసిస్‌లో చేరతారని చెప్పేంత వరకూ వెళ్లింది. ఆ కామెంట్స్ ఎంతగానో బాధించాయి. నేను మీడియా పర్సన్‌ను కాబట్టి విమర్శలను పట్టించుకోను. కానీ నా భర్తపై అలాంటి కామెంట్స్‌తో ఎందుకు దాడి చేస్తున్నారు..? నా భర్త గురించి వివరాలకు కూడా మీకు తెలీవు. కానీ కామెంట్స్ మాత్రం చేసేస్తారు. ఇప్పటికీ నేను నా భర్తతో దిగిన ఫొటోను పోస్ట్ చేస్తే.. పదిలో తొమ్మిది కామెంట్స్ మా పెళ్లి మీదనే ఉంటాయి.

# బాలీవుడ్ నటి అమీషా పటేల్‌కు చేదు అనుభవం

**టాకీస్:** బాలీవుడ్ నటి అమీషా పటేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివుడిని దర్శించుకునేందుకు ముంబై జుహూలోని ఓ శివాలయానికి వెళ్లారు అమీషా పటేల్. ఇక అమీషా పటేల్ వచ్చిందని తెలిసిన అక్కడి భక్తులు, బాబాలు ఒక్కసారిగా ఆమెని చూసేందుకు ఎగబడ్డారు. అమీషా ఆలయంలో పూజలు చేస్తున్న సమయంలో అమెతో ఫొటోలు దిగేందుకు ఫ్యాన్స్‌తో పాటు సాధువులు సైతం పోటీ పడ్డారు. ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టి ఫొటోలు తీసుకున్నారు. అయితే సెల్ఫీల కోసం జనాలు ఎగపడటంతో అమీషా చాలా ఇబ్బంది పడింది. అది గమనించిన టెంపుల్ సెక్యూరిటీ వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయడంతో పాటు. అమీషాతో సెల్ఫీ దిగేందుకు ముందుకు వచ్చిన ఒక సాధువుని అక్కడి నుంచి లాక్కెల్లారు. ఇక బాబా నుంచి తనను రక్షించినందుకు టెంపుల్ సెక్యూరిటీ సిబ్బందికి అమీషా పటేల్ కృతజ్ఞతలు తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే గదర్ 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది అమీషా పటేల్. సన్నీ డియోల్ హీరోగా వచ్చిన ఈ చిత్రంలో అమీషా కథానాయికగా నటించింది. అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం దాదాపు రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.